
ఈనాడు
తూర్పుగోదావరి

హనుమంత.. భక్తుల పులకింత


హనుమంత వాహనంపై స్వామి


శ్రీవారికి అభిషేకం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం వేంకటాద్రివాసుడు హనుమంత వాహనంపై ఊరేగారు. స్వామి కోదండరామ అలంకరణలో భక్తులను కటాక్షించారు. తిరువీధుల్లో వాహనసేవ కొనసాగింది. పండితుడు రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, లక్ష తులసి పూజ, నవగ్రహ హోమం జరిగాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ● గురువారం తిరుప్పావడ సేవ, యోగ నారసింహ అలంకారంలో సింహవాహన సేవ ఉంటాయి.

లావాదేవీలు.. అక్రమమా.. సక్రమమా?

16 గంటలపాటు మద్యం డిస్టిలరీల్లో సాగిన సీఐడీ సోదాలు


సోదాలు సాగిన కోటపాడులోని పీఎంకె డిస్టిలరీ


ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, రంగంపేట: వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లు మద్యం డిస్టిలరీలు నిబంధనల మేరకే కార్యకలాపాలు సాగించాయా..? అతిక్రమణలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణంలో సీఐడీ అధికారుల నిశిత శోధన సాగుతోంది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామ సమీప బీడీహెచ్ అగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్.. రంగంపేట మండలం కోటపాడులో పీఎంకె డిస్టిలేషన్ ప్రై. లిమిటెడ్.. నల్లమిల్లిలోని ప్రాగ్ డిస్టిలరీలో సీఐడీ డీఎస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మంగళవారం సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన తనిఖీలు అర్ధరాత్రి 1.30 వరకు సాగాయి. 16 గంటల పాటు కీలక దస్త్రాలు పరిశీలించి నివేదికలో నమోదు చేసుకున్నారు. కీలక దస్త్రాలు, కంప్యూటర్లలోని హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుని సీఐడీ కార్యాలయానికి తరలించారు. వీటిలో ఏముందో తెలుసుకునేందుకు పరిశీలన ప్రక్రియ బుధవారం నుంచి చేపట్టారు. గత అయిదేళ్లలో ప్రొక్యూరింగ్ ఆర్డర్ ఎవరి నుంచి ఎంత వచ్చింది..? అబ్కారీ శాఖ కమిషనర్ నుంచి వచ్చిన ఆర్డర్ ప్రకారం మద్యం నిల్వలు సరఫరా చేశారా..? రాజకీయ జోక్యంతోనో, అప్పటి ప్రభుత్వ పెద్దల అనధికారిక ఆజ్ఞలతోనో లెక్కకు మించి బయటకు మళ్లించారా..? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఎన్నికలకు ముందు విచ్చలవిడిగా మద్యం పంపిణీ సాగడంతో.. డిస్టిలరీల్లో ఆయా కాలంలో సాగిన సరకు ఉత్పత్తులపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మరో వారం పది రోజుల్లో ఆయా డిస్టిలరీల్లో లావాదేవీలు అక్రమమా..? సక్రమమా..? అనేది స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. సీఐడీ బృందాలు ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహకారం తీసుకున్నా.. అనుమానాల నివృత్తికే తప్ప.. దస్త్రాల పరిశీలనలో వారి సేవలను వాడుకోలేదు. దస్త్రాలు, హార్డ్ డిస్కుల పరిశీలన అనంతరం స్పష్టత వచ్చాక డిస్టిలరీల వారీగా నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

నవ్య ప్రణాళికలు.. పారిశ్రామిక వెలుగులు

పెట్టుబడుల ఆకర్షణ.. ఉపాధి అవకాశాలు పెంచేలా కసరత్తు



ఇవీ క్లస్టర్లు.. ఉపాధికి నిచ్చెనలు



◆ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో పప్పుదినుసుల ఉత్పత్తుల క్లస్టర్ నడుస్తోంది. తాజాగా రూ.10 కోట్ల చొప్పున పెట్టుబడులతో మండపేటలో జ్యూయలరీ, పరుపులు.. మామిడికుదురు, మలికిపురంలో కోకోనట్ విలువ ఆధారిత క్లస్టర్లు, ఆత్రేయపురంలో పూతరేకులు, పచ్చళ్ల క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.



◆ తూర్పుగోదావరి జిల్లాలోని రంగంపేటలో ఫర్నిచర్, రాజానగరం మండలంలో సిరామిక్, గ్రాఫైట్ క్రూసబుల్ (బంగారు నగలు కరిగించే పరికరాలు).. కడియం మండలంలో టెక్స్‌టైల్స్, చాగల్లు ప్రాంతంలో జీడిపిక్కల క్లస్టర్ల ఏర్పాటుకు కసరత్తు సాగుతోంది.



◆ కాకినాడ జిల్లా రమణయ్యపేటలో ప్రింటింగ్, గండేపల్లి మండలం సూరంపాలెంలో పాలిమర్స్, కాకినాడ పోర్టు ప్రాంతంలో రైస్ మిల్లింగ్, మరికొన్ని ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లకు ప్రతిపాదించారు.

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక- చిత్రమిదీ..

జిల్లా	భారీ-మధ్య తరహా	ఉపాధి	ఎంఎస్ఎంఈలు	ఉపాధి
కాకినాడ	62	32,227	13,725	53,027
తూర్పుగోదావరి	38	19,946	31,056	1,00,815
అంబేడ్కర్ కోనసీమ	7	2,360	10,600	21,000

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

■ కాకినాడ, తూర్పు, కోనసీమ జిల్లాలు వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు.. బియ్యం, పప్పు మిల్లులు, ఎడిబుల్ ఆయిల్, సుగర్, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, పొటాటో చిప్స్, బిస్కట్లు, బేకరీ వంటి ఉత్పత్తుల పరిశ్రమలకు ఆస్కారం ఉంది. తాండ్ర, నూడిల్స్, పప్పుళ్ల, జీడిపిక్కలు, పౌల్ట్రీ, పశు దాణా పరిశ్రమలూ నెలకొల్పవచ్చు. సంప్రదాయ వంటకాలు, మిఠాయిలు తయారీ రంగాల్లోనూ రాణించే వీలుంది.

అవకాశాలు అందిపుచ్చుకుంటే..

■ ఇటుకలు, సిరామిక్ టైల్స్, శానిటరీ సామగ్రి, ఆటోక్లేవ్ బ్రిక్స్, ఫ్లైయాష్ బ్రిక్స్, రూఫ్ షీట్స్, ప్లాస్టిక్ బెస్ట్ రోడ్డు మెటల్, క్రాఫ్ట్ పేపర్, పాలిథిన్ పౌచ్‌లు, నార సంచులు.. పాఠశాల/కార్యాలయాల బ్యాగులు, థర్మాకోల్ సంచులు, శానిటరీ నాప్కిన్లు, రెడీమేడ్ వస్త్ర పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. ■ జనరల్ ఇంజినీరింగ్ వర్క్స్, ఫ్యాబ్రికేషన్, రిగ్గల నిర్మాణం, బోట్/షిప్, ఫ్లోటింగ్ వెసెల్స్ మరమ్మతుల పరిశ్రమలు ఏర్పాటుచేయొచ్చు.

భూనిధి ఉంటే..

పరిశ్రమల ఏర్పాటుకు నిర్దేశించిన భూములను వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీలకు మళ్లించింది. ఎక్కడా భూ బ్యాంకు లేదు. కాకినాడ జిల్లాలో పారిశ్రామిక వాడల్లో 95.04 ఎకరాలు మాత్రమే ప్లాట్లు రూపంలో ఖాళీగా ఉంది. ప్రస్తుతం నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. భూములను నియోజకవర్గాల వారీ కేటాయించాలి.

అపార వనరులకు ఉమ్మడి తూర్పుగోదావరిలో కొదవలేదు. ధాన్యాగార్ల ఇది.. సువిశాల సాగర తీరం.. గోదావరి పరివాహకం.. చమురు- సహజ వాయు నిక్షేపాలు.. సారవంత భూములు ఉన్నాయి. ఇక్కడి వనరులు సద్వినియోగం చేసుకుంటే ప్రగతి పరుగులు తీయడం కష్టమేమీ కాదు. పరిశ్రమల ఏర్పాటు, ఉపాధికీ ఆస్కారం ఎక్కువే. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో స్తబ్దత నెలకొంది. కూటమి ప్రభుత్వ రాకతో సానుకూల పరిస్థితి ఏర్పడడం.. నూతన పారిశ్రామిక పాలసీకి కసరత్తు చేస్తుండడంతో ప్రస్తుతం ఉత్సాహ వాతావరణం నెలకొంది.

పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

పరిశ్రమల ఏర్పాటుకు అనువైన, వనరులున్న జిల్లా ఇది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో పారిశ్రామిక అవసరాలకు భూములు సేకరించాల్సిఉంది. క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద బ్యాంకు రుణాలు, రాయితీ అందజేసి 193 యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహించాం.

- ప్రదీప్‌కుమార్, ఏడీ, పరిశ్రమల శాఖ, తూర్పుగోదావరి జిల్లా

తుపానుతో పలు రైళ్ల రద్దు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో బుధవారం తూర్పుగోదావరి జిల్లా మీదుగా రాకపోకలు సాగించే 34 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. వీటిలో దూరప్రాంత సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ నెల 25 వరకు పునరుద్ధరించే పరిస్థితి లేదని చెబుతున్నారు. అప్‌లో 14, డౌన్‌లో 20 రైళ్ల రద్దు కారణంగా ఇక్కడి నుంచి విజయవాడ, సికింద్రాబాద్ వైపు, ఇటు విశాఖపట్నం వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

హెల్ప్‌డెస్క్‌ల ఫోన్ నంబర్లు ఇవి..	
రాజమహేంద్రవరం:	0883 2420541
నిడదవోలు:	0881 3223325
తుని:	0885 4252172
సామర్లకోట:	8842327010



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిడదవోలు, రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు కాకినాడ జిల్లా పరిధిలోని తుని, సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సహాయ కేంద్రాలు(హెల్ప్‌డెస్క్‌లు) ఏర్పాటు చేశారు. 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

వాలంటీరు హత్యకేసులో ఆ నలుగురు ఎక్కడ?

పోలీసుల ముమ్మర గాలింపు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, ముమ్మిడివరం: అయినవిల్లికి చెందిన వాలంటీరు, దళిత యువకుడు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో మరో నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరిలో ఇద్దరికి మరికొన్ని హత్యానేరాలతో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కేసుల వివరాలూ బయటకు తీస్తున్నారు. దుర్గాప్రసాద్ హత్య జరిగిన తరువాత 2022 సెప్టెంబరులో ముమ్మిడివరం మండలం అనాతవరంలోనూ ఓ ఘటన జరిగింది. ఓ దళిత యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి సమీపంలోని పంట బోదెలో పడేశారు. దుర్గాప్రసాద్ హత్యోదంతంలో పాల్గొన్న నిందితుల్లో కొందరు ఇందులోనూ ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ముమ్మిడివరానికి చెందిన వైకాపా నాయకుడిని విచారణకు తీసుకెళ్లిన పోలీసులు, కొన్ని వివరాలు సేకరించి విడిచిపెట్టారు. అనుమానితులను విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాలంటీరు ఉదంతంలో ప్రధాన నిందితుడు పినిపే శ్రీకాంత్‌తో పాటు, ఇతర నిందితులతో ఎక్కువ దఫాలు ఫోన్‌లో మాట్లాడిన వారి వివరాలు సేకరిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే నిందితులందరినీ అరెస్టు చేస్తామన్నారు.

కుమారుడిని కలిసిన విశ్వరూప్

రాజమహేంద్రవరం నేరవార్తలు: వాలంటీరు హత్యకేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న శ్రీకాంత్‌ను బుధవారం తండ్రి, మాజీ మంత్రి విశ్వరూప్ ములాఖత్‌లో కలిశారు. వ్యక్తిగత న్యాయవాదితో కలిసి వెళ్లిన విశ్వరూప్ కుమారుడితో 30 నిమిషాలపాటు మాట్లాడారు. కాగా శ్రీకాంత్‌ను మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు కారాగారానికి తీసుకొచ్చి అప్పగించారని డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.విజయ కుమార్ తెలిపారు.



రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో జేసీ, డీఆర్వో

నమ్మకం పెరిగేలా పని చేయాలి

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ప్రజల్లో నమ్మకం పెంచేలా పనితీరును మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి రెవెన్యూ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని దృశ్య మాధ్యమ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాస్థాయి రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించారు. ఏదైనా ఒక అర్జీ పరిష్కారం కోసం వేచి ఉండే ధోరణితో కాకుండా సమయానుకూలంగా స్పందించాలన్నారు. మండలస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు సంబంధించిన అర్జీలు కూడా కలెక్టరేట్ వరకు వస్తుండటంపై అధికారులను ప్రశ్నించారు. ఇకపై రెవెన్యూ అధికారుల సమావేశం డివిజన్ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. పీపుల్స్ తహసీల్దార్లుగా రెవెన్యూ అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న అర్జీలకు సరైన పరిష్కారం చూపకపోవడం వల్లే మళ్లీ తిరిగి వస్తున్నాయన్నారు. డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణిసుస్మిత, అధికారులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ సభ్యులు

శాస్త్రీయ విద్య లక్ష్యంగా రాజీలేని పోరాటం

ఏ.వి.ఏ రోడ్డు: సామ్రాజ్యావాద దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాల ప్రభావంతో 1974 అక్టోబరు 12న ఉస్మానియాలో పురుడుపోసుకున్న పీడీఎస్‌యూ శాస్త్రీయ విద్య లక్ష్యంగా రాజీలేని పోరాటాలు సాగిస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వేంకటేశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో ఈ నెల 28న జరగబోయే పీడీఎస్‌యూ 50 వసంతాల జాతీయ సభల గోడ పత్రికను స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆవిష్కరించారు. వివిధ సంఘాల రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు పాల్గొనే సభలను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.భాను ప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధు, ఐఎఫ్‌టీయూ, అరుణోదయ నాయకులు సూరిబాబు, అరుణోదయ నాయకులు శివ తదితరుల పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

డెంగీ బెంగ

జీజీహెచ్‌కు పెరిగిన రోగులు

రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు విష జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్, మాతాశిశు విభాగాలకు వచ్చే కేసుల్లో 80 మంది వరకు జ్వర పీడితులే ఉంటున్నారు. వీరికి పరీక్షలు, మందులు, చికిత్స పూర్తిస్థాయిలో అందుతున్నా వార్డుల్లో పడకలు సరిపడక తిప్పలు తప్పడం లేదు. ఒక్కోసారి ఒకే పడకపై ఇద్దరేసి రోగులను ఉంచి చికిత్స చేయాల్సి వస్తోంది.


న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

జీజీహెచ్‌లోని జనరల్ మెడిసిన్ విభాగానికి జ్వర పీడితుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా జిల్లాలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం, రాజమహేంద్రవరం నగరం, కొవ్వూరు, కడియం ప్రాంతాలతోపాటు కోనసీమ జిల్లాలోని రావులపాలెం, అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ప్రాంతాల నుంచి డెంగీ లక్షణాలతో పీడితులు నిత్యం వస్తున్నారు. ఇందులో సుమారు 20-25 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతుండడం కలవరపెడుతోంది. వీరిలో పది శాతం మందికి ప్లేట్లెట్లు పడిపోయి ప్రమాదకర పరిస్థితి ఎదురవుతోంది. ఇటువంటి వారిలో కొందరు బయట ప్రాథమిక వైద్యం చేయించుకుని ప్రాణాల మీదకు వచ్చిన తరువాత జీజీహెచ్‌కు వస్తుండడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. రాజమహేంద్రవరం వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చినా పడకలు పెరగలేదు. కొత్త భవనాలు అందుబాటులోకి రాక.. రోగుల తాకిడి పెరిగి సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి 120 పడకలు ఉండగా ఇందులో 25 ఐసీయూ బెడ్లు ఉన్నాయి. ప్రస్తుతం డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఒకే బెడ్‌పై ఇద్దరేసి రోగులను ఉంచుతున్నారు.

వేచి ఉండాల్సిందేనా..

జీజీహెచ్‌కు జ్వరాలతో వచ్చిన వారికి వైద్యులు మలేరియా, డెంగీ, ఇతర విష జ్వరాలకు సంబంధించి పరీక్షలు రాస్తున్నారు. రోగులు నమూనాల సేకరణ కేంద్రం వద్దకు వెళ్లి రక్త నమూనాలు ఇచ్చేందుకు బారులు తీరాల్సిన పరిస్థితి. తీరా లైన్లలో ఉండి నమూనాలు ఇచ్చినా మధ్యాహ్నం మూడు గంటల తరువాత రావాలని సూచిస్తున్నారు. నాలుగు గంటల తరువాత వైద్యులు ఓపీలో అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. దీంతో మరో రోజు వచ్చి వైద్యుడికి రిపోర్టులు చూపించి చికిత్స పొందాల్సి వస్తోందని, రిపోర్టులు త్వరితగతిన అందించేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. రక్త నమూనాల సేకరణ కేంద్రం వద్ద సైతం సిబ్బంది రోగులు, వారి సహాయకులతో దురుసుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేల్కొనకుంటే ముప్పే..



ప్రస్తుతం ఆసుపత్రికి డెంగీ లక్షణాలతో అధికంగా వస్తున్నారు. గ్రామస్థాయిలో సరైన అవగాహన లేక జ్వరాలను నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దోమలు వ్యాపించకుండా తెరలు వినియోగించడం, నీటి నిల్వ లేకుండా చూసుకోవడం, పరిసరాల శుభ్రత పాటించాలి. ఒక్కరోజుకు మించి జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, రాజమహేంద్రవరం జీజీహెచ్

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ: జేసీ

రాజమహేంద్రవరం కలెక్టరేట్, కొవ్వూరు పట్టణం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన ధాన్యానికి సంబంధించి సొమ్ము 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్(జేసీ) చిన్నరాముడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అప్పసాని నాగమణి అనే రైతు నుంచి 16.40 మెట్రిక్ టన్నుల కామన్ రకం ధాన్యాన్ని ఈ నెల 21 సేకరించగా.. అందుకు సంబంధించి చెల్లించాల్సిన రూ.37,720 నగదు బుధవారం ఆ రైతు బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. కొవ్వూరు మండలం ధర్మవరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఈ నెల 21, 22 తేదీల్లో సేకరించిన ధాన్యానికి సంబంధించి పోలిశెట్టి శేషయ్య అనే రైతు ఖాతాకు రూ. 2,14,368, పి.రమేష్ అనే రైతు ఖాతాకు రూ.85,560 జమ చేసినట్లు జేసీ తెలిపారు.

ట్రాక్టర్లపై తరలించి.. అధిక ధరకు విక్రయించి

అనుమతుల ముసుగులో అక్రమార్కుల ఇసుక దందా

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

ఉచిత ఇసుక విధానాన్ని కొంత మంది దళారీలు సొమ్ము చేసుకొంటున్నారు. గ్రామాల్లో ఇంటి అవసరాలకు ట్రాక్టర్లపై ఇసుక తీసుకెళ్లొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిని అడ్డుపెట్టుకొని దళారులు అక్రమమార్గాన ఇసుక తరలించేస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రాజమహేంద్రవరంలో రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. నగరాన్ని ఆనుకొని ఉన్న గ్రామాల్లోనూ జోరుగా సాగుతోంది. జిల్లాలో 16 రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన తరుణంలో వాటిని పక్కన పెట్టి గోదావరి గట్టు కనబడితే చాలు గాటు పెట్టి ఇసుక తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు.


పెండ్యాల రీచ్‌కు వచ్చిన ట్రాక్టర్లు

కలెక్టరేట్‌లో లారీ యజమానుల ఫిర్యాదు..

కడియం మండలం పరిధిలో వేమగిరి, బుర్రిలంక రేవుల నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాలకు ఇసుక అక్రమంగా ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. పరిసర గ్రామాల్లో అయితే ట్రాక్టరు ఇసుక రూ. 3 వేలకు, 10 కి.మీ దాటితే రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. నిడదవోలు పరిధిలో పెండ్యాల, పందలపర్రు రేవుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కాతేరు దాటిన తర్వాత సీతానగరం వరకు ప్రైవేటు స్థలాల్లో బాటలు వేసి అక్రమంగా లారీలతో ఇసుక తరలించేస్తున్నారు. ట్రాక్టర్లతో ఇసుక రేవుల నుంచి బయటకు తీసుకొచ్చి, వారి సొంత స్థలాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి తిరిగి లారీలతో తరలించి రెండున్నర యూనిట్లు రూ. 15 వేలు చొప్పున అమ్ముతున్నారు. ఈ పరిణామాలపై లారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు ఇసుక వ్యాపారాన్ని నమ్ముకొన్నామని, ఇప్పుడు ట్రాక్టర్ల వల్ల తమ పొట్టకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేటులో ఫిర్యాదు చేశారు. కొన్నిచోట్ల ఇసుక రీచ్‌ల్లోకి ట్రాక్టర్లు వెళ్లకుండా జేసీబీలతో గుంతలు తవ్వేశారు.

ఆన్‌లైన్ ఇబ్బందులు..

కాగా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకొన్న వారికి చేదు అనుభవం ఎదురవుతోంది. అనుమతి ఉన్న రేవుల వద్ద లారీ యజమానులు ఆన్‌లైన్ బుకింగ్‌కు ఇసుక తరలించేందుకు మొగ్గు చూపడం లేదు. ఇసుక తరలింపునకు సంబంధించి లారీ కిరాయి అందులోనే రూ. వెయ్యి వరకు నిర్ణయించడంతో లారీ యజమానులు ముందుకు రావడం లేదు. కేవలం రెండున్నర యూనిట్లతో లారీ ఇసుక తరలింపునకు ఆన్‌లైన్‌లోనే రేటు నిర్ణయించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే రేవుల్లో నేరుగా ఇసుక తరలింపులో ఏకంగా రూ 2వేలు, ఆపైబడి ఆదాయం వస్తుంది. ధవళేశ్వరం, గాయత్రి, కొవ్వూరు, ఔరంగబాదు రేవుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో కొంత మంది దళారులు ఏకమొత్తంగా 20 టన్నుల ఇసుక బుక్ చేసి బెంజి లారీల్లో తరలించి అక్కడ నుంచి రేటు కట్టి మామూలు లారీల్లో అధిక మొత్తానికి అమ్మకాలు సాగిస్తున్నారు.

ఇథనాల్ పరిశ్రమ ముట్టడికి యత్నం

పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైటాయింపు

గోకవరం: కాలుష్యం వెదజల్లే ఇథనాల్ పరిశ్రమను తక్షణమే మూసివేయాలని గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. పరిశ్రమను ముట్టడించేందుకు బుధవారం మహిళలు బయలుదేరగా పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించారు. పరిశ్రమ నుంచి ఒక్కోసారి మంటలు కూడా వస్తున్నాయని పక్కనే ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ చమురు టెర్మినల్స్ ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన కలుగుతోందన్నారు. పరిశ్రమను దూరంగా తరలించాలన్నారు. గోకవరం-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలకు ఆటంకం కలిగింది ◆ గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక, బావాజీపేట, అచ్యుతాపురంలో 163 (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ అమలుచేస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ సాయిప్రసాద్ తెలిపారు.

కాలుష్యాన్ని మరింత తగ్గించేలా చర్యలు: ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే వాయు, శబ్ద కాలుష్యాన్ని మరింత తగ్గించేలా చర్యలు చేపట్టినట్లు అస్సాగో ఇండస్ట్రీస్ ఆపరేషన్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ వీకే శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఇథనాల్ ఉత్పత్తిలో భద్రతను మరింత మెరుగుపరుస్తున్నామని..గత 20 రోజులుగా డ్రైయర్, ఆవిరి నుంచి వెలువడే వాసనలను 80 శాతం వరకు తగ్గించేందుకు అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు.


ఆందోళనలో గుమ్మళ్లదొడ్డి గ్రామస్థులు

28న ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికట్'

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికట్' శిబిరాలను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జగ్గంపేటలోని ఎస్.ఎస్.విద్యావిహార్ వద్ద నిధిఆప్‌కే నికట్ జరుగుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి తాళ్లరేవు పీసీఎస్‌సీ, కాకినాడ జిల్లాకు సంబంధించి బెండపూడిలో ఎస్.ఎస్.విద్యావిహార్, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఉండి ఎలిమెంట్స్ అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం యార్లగడ్డ ఏజీ బాలికల ఉన్నత పాఠశాల, గంగవరం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మారేడుమిల్లి మండలంలోని జేబీవీ స్కూల్ వద్ద నిధి ఆప్‌కే నికట్ శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

సామర్లకోట, కడియం, ధవళేశ్వరం, కొంతమూరు

గత కొంతకాలంగా అబలలపై అత్యాచారాలు.. అసాంఘిక ఘటనలు నేపథ్యంలో కరాటే సాధన పట్ల విద్యార్థినులలో ఆసక్తి పెరుగుతోంది. చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం నేర్చుకుంటూ జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. తద్వారా పలువురు యువతులు, మహిళలకు ఆదర్శంగా నిలుస్సున్నారు.

కరాటే శిక్షణ.. అతివలకు ఆత్మరక్షణ

☛ సమాజంలో వరుస ఘటనలతో పెరుగుతున్న ఆసక్తి ☛ జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతోన్న ధీర వనితలు

మహిళలను దేవతలుగా పూజిస్తున్న దేశం మనది.. అలాంటి ఇక్కడ గత కొన్నేళ్లుగా జరుగుతున్న అకృత్యాలు మానవత్వానికే మాయనిమచ్చగా మారుతున్నాయి. నిర్భయ, దిశ వంటి ఘటనలు అతివల మానసికంగా, శారీరకంగా బలోపేతం కావాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. ఆ క్రమంలోనే ఆత్మరక్షణ విద్యలను నేర్చుకునేందుకు ప్రస్తుతం ఆసక్తి చూపుతుండటం కీలకమైంది. కరాటేలో తర్ఫీదు పొంది మెలకువలు నేర్చుకోవడంతో పాటు.. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు హాజరైన పతకాలు సాధిస్తుండటం మన రాజమహేంద్రవరం నారీమణులకే చెల్లింది. వారిలో కొందరి అభిప్రాయాలు, ప్రస్తావాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.

కరాటేపై ఇష్టంతో..

నాకు కరాటేపై ఆసక్తితో తర్ఫీదు పొందా. రాజమహేంద్రవరంలోని కరాటే కోచింగ్ కేంద్రంలో నాన్న శిక్షణ ఇప్పించారు. ఇటీవల హైదరాబాదులో జాతీయ స్థాయి పోటీలకు హాజరై బంగారు పతకం సాధించాను. 2023లో నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లోనూ ప్రతిభ కనబరిచా. మధ్యప్రదేశ్, విశాఖపట్నంలో జరిగిన పోటీల్లోనూ సత్తా చాటడం చాలా సంతోషంగా ఉంది. మహిళలకు ఆత్మరక్షణ కోసం ఈ కరాటే చాలా అవసరం. తద్వారా స్వీయభద్రత పొందడానికి అవకాశం ఉంటుంది.



\- శ్రీవిద్య స్వాతి లక్ష్మీదేవి, రాజమహేంద్రవరం

ఆర్మీ ఉద్యోగంలో చేరతా

మా నాన్న లారీడ్రైవర్. ఆయన ప్రోత్సాహంతో కరాటేలో నాలుగేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నాను. ఇటీవల హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో జరిగిన నేషనల్ కరాటే పోటీలలో బంగారు పతకం సాధించాను. ఇంకా అనేక పోటీల్లో పాల్గొన్నా పతకాలు సాధించా. ప్రస్తుతం ఆర్మీ ఉద్యోగం... కరాటే నేర్చుకున్నానన్న తృప్తి మాత్రం నాకు చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో మహిళల భద్రత కీలకంగా మారింది. ప్రతి యువతి తనకు తాను ఆత్మరక్షణ సాధించేలా రూపొందాలంటే కరాటే లాంటి క్రీడలు తప్పనిసరిగా నేర్చుకోవాలి. అప్పుడే ధైర్యంగా సమాజంలో రాణించగలం. క్రీడా కోటాలో ఆర్మీలో చేరాలన్నదే నా లక్ష్యం.



\- కె.లక్ష్మీభవాని, కొంతమూరు

అమ్మా నాన్న ప్రోత్సాహంతో..


అమ్మా నాన్న ప్రోత్సాహంతో కరాటేలో నాలుగేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. 2023లో హైదరాబాద్ ఎల్బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో స్పారింగ్ విభాగంలో బంగారు పతకం సాధించడం మరిచిపోలేని అనుభూతి. ఇంకా అనేక పోటీల్లో పాల్గొన్నాను. ఈ కరాటే నేర్చుకోవడం ద్వారా నా శక్తి సామర్థ్యాలపై నాకు నమ్మకం కుదిరింది. ఎలాంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనగలన్న ధైర్యం వచ్చింది. ప్రతి యువతి తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలి.



\- ఎన్.శ్రీలక్ష్మీలత, రాజమహేంద్రవరం

పేదల వైద్యుడు తేతలి మృతికి సంతాపం

రాజమహేంద్రవరం వైద్యం: పేదల వైద్యుడిగా పేరొందిన డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు(79) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొంతకాలంగా ఉదర సంబంధిత ఇబ్బందితో బాధపడుతున్న ఆయన రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలో బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. 1945 ఆగస్టు 29న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన ఆయన కర్నూలు వైద్య కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్తులో సివిల్ సర్జన్‌గా సేవలు ప్రారంభించి తణుకు, కొయ్యలగూడెం, కాకినాడ ఆసుపత్రుల్లో వైద్యుడిగా పని చేసి పేదలకు సేవలు అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా.. ఉమ్మడి జిల్లా డీసీహెచ్ఎస్‌గా ఆయన విధులు నిర్వహించారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేసి అనేక మంది వైద్యులను తీర్చిదిద్దారు. గోదావరి జిల్లాల్లో పేరెన్నికగన్న పలువురు వైద్యులు డాక్టర్ తేతలి శిష్యులే. డీసీహెచ్ఎస్‌గా పని చేసినప్పుడు జిల్లాలోని పలు వైద్యశాలల్లో మౌలిక వసతులు, సేవల పెంపునకు విశేష కృషి చేశారు. రాజమహేంద్రవరం వైద్యశాలలో ప్రభుత్వ నిధులు, దాతల సహకారాన్ని కూడగట్టి పలు సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వ సేవల నుంచి రిటైరైనా నగరంలో ఓ క్లినిక్‌ను ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవలందించేవారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

గోదారి చెంతే.. నీటి కష్టాలు

గోదావరి ఏడుమగట్టున పలు ఎత్తిపోతల పథకాలున్న సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నంలో గత కొద్దిరోజులుగా తాగునీటి సమస్య తలెత్తి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ రక్షిత పథకం నుంచి వచ్చే పైపులైను మరమ్మతులకు గురవడం, తక్షణమే గోదావరి జలాల ప్రాజెక్టు మరమ్మతులు చేయడంలో తాగునీటికి కటకటలాడుతున్నామని శివారు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో ప్లాస్టిక్ డ్రమ్ములు కొనుక్కుని ఇంటి ముందు ఉంచితే ట్యాంకర్ వచ్చి నీళ్లు నింపుతోంది. తాగడానికి, వాడకానికి అదే నీటిని వాడుకుంటున్నామని వాపోతున్నారు. ప్లాస్టిక్ డ్రమ్ములు లేకపోతే నీరు దక్కే పరిస్థితి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 మీటర్ల దూరంలోనే గోదావరి నది కనిపిస్తున్నా తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నామని కుటుంబాలు బాధ వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందంటున్నారు. పంచాయతీ కార్యదర్శి సరోజినీ రాణి వేరే పంచాయతీకి బదిలీపై వెళ్లారు. పెదకొండేపూడికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ పోసియ్యదొరను ఇన్‌ఛార్జిగా నియమించినా ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు.

\- న్యూస్‌టుడే, సీతానగరం



పురుషోత్తపట్నంలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా..

సెంచరీలతో సత్తా చాటారు

కడప క్రీడలు: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా కడపలో జరుగుతున్న మ్యాచ్‌లో డ్రాగా ముగిశాయి. రెండోరోజు బుధవారం బ్యాట్స్‌మెన్ సెంచరీలతో సత్తా చాటారు. కేవీఎస్ఆర్ఎం మైదానంలో కర్నూలుతో జరిగిన మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 64/2తో ఇన్నింగ్స్ కొనసాగించిన తూర్పు గోదావరి జట్టు 67.4 ఓవర్లలో 274 పరుగులు చేసింది. కె.కృష్ణసాకేత్‌రెడ్డి సెంచరీ(113, 94 బంతుల్లో, 7×4, 6×6)తో శతకొట్టగా, కార్తిక్ 89 పరుగులు చేశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 117/7 స్కోరు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది.

ముగిసిన ఖోఖో క్రీడాకారుల తర్ఫీదు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన ఖోఖో క్రీడాకారుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. పురపాలక సంఘ వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజేస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఖోఖో శిక్షణ నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 18 మంది క్రీడాకారులు ఈ నెల 25న కాణిపాకంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంటుకు ఎంపిక అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడా దుస్తుల కిట్లును అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో కార్యదర్శి పట్టాభి, కౌన్సిలర్ పాలిక కుసుమ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, శిబిరం నిర్వహకుడు జాన్ కెనడి, నాయకులు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన క్రీడాకారులతో కౌన్సిలర్ కుసుమ, ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు

మందుబాబులకు రూ.1.22 లక్షల జరిమానా

దానవాయిపేట, (రాజమహేంద్రవరం): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన, మత్తులో వాహనాలు నడిపిన పలువురికి జిల్లా పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. గత వారం రోజులుగా జిల్లాలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ డ్రైవ్‌లో 23 మందిపై కేసులు నమోదు చేసి, బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ముగ్గురికి రూ. 10 వేలు చొప్పున, 18 మందికి రూ. 5 వేలు చొప్పున, ఒకరికి రూ.2వేలు మొత్తం రూ.1.22 లక్షలు జరిమానా విధించారు. రాజమహేంద్రవరంలోని తుమ్మలోవ ప్రాంతానికి చెందిన గరగ శ్రీనివాసరావుకు గతంలో కోర్టు విధించిన రూ.5 వేలు జరిమానా నిర్ణీత కాల వ్యవధిలో చెల్లించక పోవడంతో అతడికి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ డ్రైవ్‌లు నిత్యం జిల్లాలోని ఆయా స్టేషన్ పరిధిలో నిర్వహిస్తు కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్పీ డి.నరసింహకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

శైవ క్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో శైవక్షేత్రాలు, ఆలయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు సూచించారు. వచ్చే నెల 2 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు చెందిన ఈవోలతో కాకినాడ డీసీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచారామ క్షేత్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, స్నానానికి నీటి సదుపాయంతోపాటు, ఉచిత దర్శనాలు తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. సోమవారాలు, ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్నానఘట్టాల వద్ద రక్షణ చర్యలతోపాటు, మహిళల కోసం గదులు ఏర్పాటు చేయాలన్నారు. వేకువజామున 3గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఆలయాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రముఖ ఆలయాల్లో గర్భాలయ అభిషేకాలు నిలిపేయాలన్నారు. ప్రత్యేక మండపాలు, ఉత్సవ విగ్రహాలు పెట్టి అభిషేకాలు చేయాలన్నారు. దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 31 లోగా పనులు పూర్తి చేయాలన్నారు. కాకినాడ జిల్లా డీఈవో దుర్గాభవానీ, ఉమ్మడి జిల్లాకు చెందినఇన్‌స్పెక్టర్లు, ఈవోలు పాల్గొన్నారు.



ఈవోలతో ఏర్పాట్లపై చర్చిస్తున్న డీసీ రమేష్‌బాబు

29న ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా జట్ల ఎంపికలు

మసీదుసెంటర్(కాకినాడ): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు కాకినాడ డీఎస్ఏ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ బుధవారం తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమేనన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి కాకినాడ డీఎస్ఏ మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. ఆధార్‌కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు టీఏ, డీఏలు ఉండవన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 28 మధ్యాహ్నం ఒంటిగంటలోగా స్వయంగా లేదా dsakakinada2023@gmail.com ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ట్యాంకరు డ్రైవరుకు గుండెపోటు

ఆసుపత్రికి తరలించే క్రమంలో మృత్యువాత

రాజమహేంద్రవరం నేరవార్తలు, న్యూస్‌టుడే: గుండెపోటు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ ట్యాంకరును రహదారిపై నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాజమహేంద్రవరం దివాన్‌చెరువు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, హైవే పోలీసులు వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని జాన్పూర్‌కు చెందిన మోల్ చంద్ర(36) అనే ఓ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ ఒంటరిగా బుధవారం రాత్రి గోదావరి గామన్ వంతెన నుంచి విశాఖ వైపుగా వెళ్తున్నాడు. మార్గ మధ్యలో దివాన్‌చెరువు గ్రామ జాతీయ రహదారి కూడలి వద్దకు చేరుకునే సరికి డ్రైవర్ చంద్ర గుండెలో నొప్పి రావడంతో ఒక్కసారిగా ట్యాంకరును రహదారి మధ్యలో నిలిపివేశాడు. వెనుక వస్తున్న లారీలు ఇతర వాహనాలు హారన్ మోగించినా ట్యాంకర్ కదలకపోవడంతో వెళ్లి పరిశీలించగా డ్రైవరు అపస్మారకస్థితిలో కనిపించడంతో స్థానికులు సీపీఆర్ చేసి హైవే పోలీసుల సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి బొమ్మూరు స్టేషన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుండెపోటు వస్తున్న తరుణంలో అప్రమత్తమై లారీని నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.





జాతీయరహదారి మధ్యలో నిలిచిన ట్యాంకర్ లారీ, (అంతరచిత్రం) మోల్ చంద్ర (పాత చిత్రం)

నర్సుల అసోసియేషన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

మసీదు సెంటర్(కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షురాలిగా బూరిగ విజయలక్ష్మి(110 ఓట్లు) విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి టి.నందన తెలిపారు. అసోసియేషన్ ఎన్నికలు కాకినాడ జీజీహెచ్‌లో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పోలీసు బందోబస్తు మధ్య అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 243 మంది ఓటర్లు ఉండగా 213 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నందన తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి(126 ఓట్లు), కార్యదర్శిగా గట్టు ప్రమోద(104 ఓట్లు), కోశాధికారిగా కాకి వెంకట పరమేశ్వరి(137ఓట్లు) గెలుపొందారన్నారు. సభ్యులుగా వి.ఇందిర, కె.దేవి, జి.వీరలక్ష్మి, బి.అక్కమ్మ, ఎం.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. విజయం సాధించిన ప్యానెల్ సభ్యులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీవో సంఘ కార్యవర్గ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. ఉమ్మడి జిల్లా ఏపీఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షుడు జి.రామమోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ల చంద్రరావు, కాకినాడ యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన కార్యవర్గ సభ్యులతో ఏపీఎన్‌జీజీవో సంఘ నాయకులు

సిద్ధివినాయక దర్శనానికి సన్నాహాలు

అయినవిల్లి: కార్తిక మాసంలో సిద్ధివినాయక స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు, 3 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారిని భక్తులు దర్శించుకునే విధంగా చర్యలు చేపడతున్నట్లు ఈవో సత్యనారాయణరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		11,500
పాతకాయ:	గండేరా	16,000
	గటగట	13,500
కొత్తకాయ:	గండేరా	15,500
	గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		12,000-13,500
కొత్త (పచ్చి) కాయ		11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

రాజమహేంద్రవరం

విద్యార్థులకు కంటి పరీక్షలు

శ్యామలాసెంటర్ : ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలకు చెందిన 620 మంది విద్యార్థులకు గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 620 ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంబరాలకు సాయం

టి.నగర్ : ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ సంబరాల నిమిత్తం ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు రూ. 25 వేలు చెక్కు బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ పాలపర్తి అబెల్ రాజుకు అందజేశారు.

సినిమాలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం) న్యూస్‌టుడే : శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యప్యాలస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, శివజ్యోతి: మార్టిన్, రంభ: రాధే కృష్ణ, మానాన్న సూపర్ హీరో,(రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్, మార్టిన్,(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, విశ్వం(రెండేసి ఆటలు).



పోటీల్లో పాల్గొన్న అక్షరశ్రీ విద్యానికేతన్ విద్యార్థులు

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



విజేతలతో పాఠశాల ప్రిన్సిపల్ మల్లికార్జునరావు తదితరులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక తిలక్‌రోడ్‌లోని అక్షరశ్రీ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ టి.నాగరత్నం మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ పోటీల్లో 10వ తరగతి విద్యార్థి కె.జైనందు, 9వ తరగతి విద్యార్థిని టి.శ్రీమనస్య, 8వ తరగతి విద్యార్థిని వి.హాసిని సాయి మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు ఈనాడు సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ టి.మల్లికార్జునరావు అందజేశారు. న్యాయనిర్ణేతగా ఎస్.లావణ్య వ్యవహరించారు.

వాహన చోదక శిక్షణతో ఉపాధికి బాటలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ఏ రంగంలోనైనా వృత్తి నైపుణ్యాన్ని సాధించగలిగితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ముఖ్యంగా రవాణా రంగంలో ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలంటే పటిష్టమైన శిక్షణ అవసరం. ఆసక్తి ఉన్న యువతకు ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో ఆవరణలో 2021లో ప్రారంభించిన హెవీ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో ఇన్‌స్ట్రక్టర్ పర్యవేక్షణలో సీనియర్ డ్రైవర్లు, నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఏపీఎస్ ఆర్టీసీ తరపున ధ్రువపత్రాలు జారీ చేయడంతోపాటు రవాణా శాఖ ద్వారా హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సులు అందిస్తున్నారు. 12వ బ్యాచ్‌కు శిక్షణ పూర్తవడంతో బుధవారం ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

బ్యాచ్‌కు 32 రోజుల చొప్పున..



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో డీపీటీవో షర్మిలాఅశోక, తదితరులు

ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో చేరిన అభ్యర్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతుల నిర్వహిస్తారు. ఇందులో ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాద రహిత డ్రైవింగ్, ఇంధనం పొదుపు వంటి అంశాల గురించి వివరిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తారు. దీనిలో భాగంగా డ్రైవింగ్ మెలకువలు నేర్పించేందుకు రెండు స్టీరింగ్‌లు ఉండే ప్రత్యేక బస్సుపై రోజూ 200 కిలో మీటర్ల వరకు శిక్షణార్థులను బయటకు తీసుకెళ్తారు. ఇలా ప్రతి బ్యాచ్‌కు 32 రోజులపాటు శిక్షణ అందించి భారీ వాహన డ్రైవర్లుగా తీర్చిదిద్దుతారు.

అర్హులు ఎవరంటే..

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో కొత్త బ్యాచ్ త్వరలో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. దీనిలో చేరేందుకు 20 ఏళ్ల నిండి, లైట్‌వెయిట్ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన అభ్యర్థులు అర్హులు. రూ. 23,600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఆర్టీసీ సర్టిఫికెట్‌తోపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఇప్పిస్తామని చెబుతున్నారు. ఇతర వివరాల కోసం డిపో మేనేజర్ - **99592 25535**, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ - **73821 12678** ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ఇప్పటివరకు 208 మందికి తర్ఫీదు..



ఇక్కడి ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 12 బ్యాచ్‌లలో 208 మంది యువతకు శిక్షణ అందించాం. వారిలో సుమారు 70 మంది ఆర్టీసీలోనే ఆయా డిపోల్లో ఆన్‌కాల్ డ్రైవర్లు, పార్కింగ్ డ్రైవర్లుగా ఉపాధి పొందుతున్నారు. మిగతావారు ఆయా సంస్థల్లో భారీ వాహన డ్రైవర్లుగా స్థిరపడ్డారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. త్వరలో 13వ బ్యాచ్‌కు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నాం.

- ఎస్.కె.షబ్బం, ఆర్టీసీ డీఎం

నైపుణ్యంగల డ్రైవర్లుగా తీర్చిదిద్దుతున్నాం..



భారీ వాహనాలు నడపడంలో నైపుణ్యం కలిగిన డ్రైవర్లుగా యువతను తీర్చిదిద్దుతున్నాం. క్రమశిక్షణతోపాటు భారీ వాహనం నడపడంలో మెలకులవలు, ప్రమాద రహిత డ్రైవింగ్ విధానాలు, రోడ్డు నియమ, నిబంధనలు.. ఇలా అన్ని అంశాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తున్నాం. నిరుద్యోగులు, విద్యార్థులతోపాటు భారీ వాహన డ్రైవింగ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కొందరు ఉద్యోగులు కూడా చేరుతున్నారు.

- వీఎస్ఎల్.రావు, ఇన్‌స్ట్రక్టర్, ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్

అన్ని అంశాలపై పూర్తి అవగాహన..



మాది స్థానిక ఆర్యాపురం. నాకు లైట్ వెయిట్ డ్రైవింగ్ లైసెన్సు ఉండటంతో దుబాయ్‌లో కొంతకాలం కారు డ్రైవర్‌గా పనిచేశా. హెవీ వెహికల్ లైసెన్సు పట్టుకుని రమ్మని అక్కడి నుంచి మళ్లీ ఫోన్ రావడంతో ఇక్కడి స్కూల్‌లో చేరి శిక్షణ పూర్తి చేశాను. బయట కంటే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇచ్చే శిక్షణ చాలా బాగుంది. ఇక్కడిచ్చే సర్టిఫికెట్ ఉపాధి విషయంలో చాలా ఉపయోగపడుతుంది.

- ఉమామహేష్, శిక్షణార్థుడు



ఆనంద్‌నగర్ యూపీహెచ్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌ఏటీవో డాక్టర్ వసుంధర

క్షయ నివారణపై అవగాహన కల్పించాలి

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా క్షయ నివారణ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని కంబాలపేట, ఆనంద్‌నగర్ యూపీహెచ్‌సీలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. క్షయ, కుష్టు, ఎయిడ్స్ వ్యాధులకు సంబంధించి ల్యాబ్ దస్త్రాలు, రోగుల కార్డులను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. క్షయ రోగులతో మాట్లాడి ప్రతి నెలా అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీ రోగులకు ప్రభుత్వం నుంచి అందే నిక్షయ్ పోషణ యోజనపై ఆరా తీశారు. ప్రతి నెలా 10, 11 తేదీల్లో లెప్రసీ డీపీఎంఆర్ కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలని సూచించారు.

ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు



నిరుపేదలకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : సినీనటుడు ప్రభాస్ పుట్టినరోజు వేడుక రాజమహేంద్రవరం నగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. యంగ్ రెబల్ స్టార్ ఫ్యాన్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.దేవీప్రసాద్ ఆధ్వర్యంలో గోదావరి గట్టున ఉన్న గౌతమీ జీవకారుణ్య సంఘంలో కేకు కోసి, అల్పాహారం అందజేశారు. జక్కంపూడి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. మహేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహణలో అశోకా థియేటర్ వద్ద ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కేకు కోసి, నిరుపేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజ్జి రాంబాబు, కప్పల వెలుగు కుమారి, బొర్రా చిన్ని, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆరోగ్యానికి సహకారం

టి.నగర్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి వైద్య సేవల నిమిత్తం రవితేజ ముందుకు రావడంపై అర్బన్ ఎమ్మెల్యే శ్రీనివాస్ అభినందించారు. స్థానిక 46వ డివిజన్‌కు చెందిన దాసింపల్లి శ్రీను, రమ్య దంపతుల కుమారుడు కుషల్‌కు మెదడు నుంచి నరాలకు సంబంధం లేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం నెలకు ఇంజక్షన్‌కు రూ. 18 వేలు ఖర్చవుతుంది. ఇలా 10 ఇంజక్షన్లు సమకూర్చేందుకు సిటీఆర్‌ఐకు చెందిన పి.రవితేజ ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే నివాసంలో చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడారు. కుషల్ ఆరోగ్యం నిమిత్తం తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మరిన్ని సేవలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో బుధవారం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నవసమాజ నిర్మాణం కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించే వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగా నవంబరు 7న క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక కోటగుమ్మం సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వాలు పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో లంక సత్యనారాయణ, సింగ్, నరేష్‌కుమార్‌రాజు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమూనా ఎన్నికలతో రాజకీయాలపై అవగాహన

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: స్థానిక లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో యాక్టిజన్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ ఛైర్మన్ కలిదిండి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎన్నికలపై అవగాహన కలిగి ఉండటం వల్ల ప్రస్తుత రాజకీయాలు అర్థమవుతాయని, భవిష్యత్తులో యువ నాయకులు తయారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నమూనా ఎన్నికల్లో ఓట్లు లెక్కిస్తున్న విద్యార్థులు

గుంతలు.. వాహన చోదకుల అవస్థలు

రాజమహేంద్రవరం నగరంలోని రామచంద్రరావుపేట నుంచి ఆర్యాపురం వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనదారుల సహనానికి పరీక్ష పెడుతోంది. కంబాలచెరువు నుంచి ఆర్యాపురం వెళ్లే ఈ రోడ్డు కంకరలేచిపోయి, గుంతలు పడి అధ్వానంగా తయారయ్యింది. ఏడాది నుంచి ఈ రోడ్డు పరిస్థితి ఇలాగే ఉందని, గతంలో ఒకసారి దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్యాచ్ వర్కులు చేశారని స్థానికులు చెబుతున్నారు. దేవీచౌక్, కంబాలచెరువు ప్రాంతాల నుంచి ఆర్యాపురం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ కూడా ఎక్కువగానే ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



–న్యూస్‌టుడే, దేవీచౌక్

దీపావళి కానుకగా 31న 'క' విడుదల



మాట్లాడుతున్న నిర్మాత చింతా గోపాలకృష్ణా రెడ్డి, చిత్రంలో కథానాయకుడు కిరణ్ అబ్బవరం

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: లాభ నష్టాలతో సంబంధం లేకుండా 'క' చిత్రాన్ని తీశామని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో యాక్షన్, సస్పెన్స్ సహా అన్ని హంగులు ఉన్నాయని, అన్ని వర్గాల వారికి తప్పక నచ్చుతుందన్నారు. స్థానిక షెల్టన్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే విడుదల చేసిన చిత్ర టీజర్‌కి మంచి పేరొచ్చిందని, పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదల కాబోతుందన్నారు. కొత్త దర్శకులు సందీప్, సుజిత్ సోదరులు కథ విషయంలో మూడేళ్లు కష్టపడారన్నారు. చిత్ర కథానాయకుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ తాను నటించిన తొమ్మిది చిత్రాలతో పోలిస్తే 'క' వైవిధ్యంగా ఉంటుందని, దీపావళి కానుకగా ఈ నెల 31న విడుదల కానుందని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. అనపర్తికి చెందిన నిర్మాత చింతా గోపాలకృష్ణా రెడ్డి శ్రీచక్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరిట నిర్మించిన ఈ చిత్రంలో తన్వీరామ్, నయన సారిక ప్రధాన పాత్రలు పోషించారన్నారు.

ప్రమాదంలో గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: మల్లయ్యపేటకు చెందిన ఎం.సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి స్థానిక పెట్రోల్ బంకు కూడలి దాటుతున్న సమయంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు సమాచారంతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రేత అరెస్టు

తాడితోట అంబేడ్కర్‌నగర్‌కి చెందిన ఎన్.నరేష్ స్థానికంగా సారా విక్రయిస్తుండగా బుధవారం ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగాలకు 60 మంది ఎంపిక

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 180 మంది విద్యార్థులు హాజరు కాగా 60 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. వారిని ప్రిన్సిపల్‌తోపాటు జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్‌కుమార్, దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు పూర్ణప్రసాద్, రాజేష్ అభినందించారు.

పాఠశాలలో అంతర్జాతీయ మోల్ దినోత్సవం

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మోల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక చున్నీలాల్ జాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవానం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులు అణువర్తనాల ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.శాంతకుమారి, సీహెచ్ రజనీ, జె.శశి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతపై అపరాధ రుసుము

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్వచ్ఛ నగరానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. తడి పొడి చెత్త నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలి, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల మేరకు నగరంలో అపరిశుభ్రత వాతావరణంపై చర్యలు తప్పవని తెలిపారు. దీనిలో భాగంగా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వినియోగిస్తే రూ. వెయ్యి నుంచి 10 వేలు వరకు అపరాధ రుసుం విధిస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.300 నుంచి 3వేలు, చెత్త కాల్చితే రూ. వెయ్యి నుంచి 5 వేలు, దుకాణాల్లో తడి, పొడి చెత్తను వేరువేరుగా నిల్వ చేయకుంటే రూ. 3 వేల వరకు అపరాధ రుసుం విధిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, మాల్స్, పెట్రోలు బంకుల్లో యూరినల్స్ ఏర్పాటు చేయకపోతే రూ. 3 వేలు, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జనకు రూ. 3 వేలు, గృహ నిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే రూ.10 వేలు, అనుమతి లేని , కలుషిత వాతావరణంలో ఆహార పదార్థాలు తయారీ, విక్రయాలకు రూ. 2 వేల నుంచి పది వేలు వరకు, రోడ్లపై ఆవులు, పందులను వదిలేస్తే రూ. 2 వేలు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 36 దుకాణాల నుంచి రూ. 1.40 లక్షలు అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసు విధులపై అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్

దానవాయిపేట: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా బుధవారం రాజమహేంద్రవరం నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ వి.దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు అమరవీరుల సేవలు, వారి ప్రాణత్యాగాల గురించి అవగాహన కల్పించారు. స్టేషన్ భౌగోళిక రూపం, రిసెప్షన్, కేసు డైరీలు, లాక్ అప్స్, 112 పనిచేసే విధానం, పోలీసు యూనిఫామ్ ర్యాంక్స్, ట్రాఫిక్ నిబంధనలు వాటి చిహ్నాలు, ర్యాగింగ్, పోక్సో చట్టాలు తదితర అంశాలపై సీఐ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, రైటర్ రాజశేఖర్, హెచ్‌సీ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నీసుపేట సమస్యలపై తెదేపా నాయకుల పరిశీలన

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచనల మేరకు 27వ డివిజన్ ఇన్నీసుపేటలో తెదేపా నేతల పరిశీలన రెండో రోజు బుధవారం కొనసాగింది. గతంలో 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యల పరిష్కారానికి వార్డు మాజీ కార్పొరేటర్ బూరా దుర్గారావు, 28వ వార్డు డివజన్ ఇన్‌ఛార్జి శీలం గోవింద ఆధ్వర్యంలో కార్యకర్తలు చర్యలు చేపట్టారు. వీరేశలింగం ప్రభుత్వ ఆస్తిక ఉన్నత పాఠశాల మైదానంలో తుప్పలు తొలగించే పనులు ప్రారంభించారు. నగరపాలక సంస్థ శానిటరి సూపర్‌వైజర్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ రామలింగేశ్వరరావు పరిశీలించారు. కష్ణరావుపేటలో నగరపాలక సంస్థ 2002లో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ అక్కడి పేదలకు ఉపయుక్తంగా ఉండేది. సుమారు నాలుగేళ్ల కిందట ఆధునికీకరణ పేరుతో రూపుమార్చినా నేటికీ ప్రారంభించలేదు. ఆకతాయిలు అక్కడ ఉన్న స్టీలు రెయిలింగ్, టైల్స్‌ని పాడుచేశారు. మూసి ఉన్న మరుగుదొడ్లను స్థానిక నాయకులు పరిశీలించి వాటి ఆవరణలో గుబురుగా పెరిగిన తుప్పలను తొలగిస్తామన్నారు.



పాఠశాల ఆవరణలో తుప్పలు తొలగిస్తున్న నగర పాలక సిబ్బంది

వేతన బకాయిల చెల్లించాలని ఆందోళన

వి.ఎల్.పురం: తమకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలంటూ రైల్వే కాంట్రాక్టు సఫయి వాలాలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే వారికి నాలుగు నెలలుగా సంబంధిత గుత్తేదారుడు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 22 మంది ఇక్కడి ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఎన్నో ఏళ్లుగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, ఇప్పటి వరకు తమతో పనిచేయించుకున్న సంస్థ కాంట్రాక్టును రైల్వేరద్దు చేయడంతో తమకు చెల్లించాల్సిన నాలుగు నెలల బిల్లు సంబంధిత గుత్తేదారుడు చెల్లించకుండా పోయాడని వారు చెబుతున్నారు. ఇక్కడి పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్టు ఇప్పుడు కొత్తగా వేరొక గుత్తేదారులకు అప్పగించారని ఆయన తక్కువ వేతనం ఇస్తానని, లేకుంటే వేరే వాళ్లతో పని చేయించుకుంటామని చెబుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తాము నెలకు రూ.15 వేలు వేతనానికి పనిచేశామని, తక్కువకు చేయలేమని చెప్పడంతో బయట నుంచి వేరే వ్యక్తులను తీసుకొచ్చి పనిచేయించుకుంటున్నారని చెబుతున్నారు. తమకు గత గుత్తేదారుడు బకాయి పడిన నాలుగు నెలల వేతనం ఇప్పించడంతోపాటు ప్రస్తుతం కొత్త గుత్తేదారుడు తమనే పనుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు రైల్వే అధికారులను కోరుతున్నారు.


రోడ్డు తవ్వి వదిలేసి.. పైపులు పగలగొట్టి..

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నగర శివారు ప్రాంతంలో పైపులైన్ నిర్మాణం కోసం సిమెంటు రోడ్డును ఇష్టం వచ్చినట్లు ఒకవైపు తవ్వేసి అసంపూర్తిగా వదిలేయడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంటు దిమ్మలు గుట్టలుగా వదిలేయడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో 44, 48వ డివిజన్‌ను ఆనుకుని ఉన్న వీధుల్లో తాగునీటి పైపులైన్ నిమిత్తం సిమెంటు రోడ్డును ఒకవైపు జేసీబీలతో తవ్వేశారు. గోతుల్లో కొత్త పైపులు వేసి తవ్వేసిన మట్టితో అదే జేసీబీలతో రహదారిని సర్ది వెళ్లిపోయారు. కాంక్రీటు దిమ్మలు ముక్కలుగా రోడ్డు మీద వదిలేయడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు ఒకవైపు కుంగిపోతోంది. వాహనాలు అదుపుతప్పి దిమ్మలపై పడిపోవడంతో గాయాల పాలవుతున్నారు. దీనికి తోడు జేసీబీలతో రోడ్డు తవ్వడం వల్ల కింద ఉన్న కొళాయి గొట్టాలు సైతం పగిలిపోయాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో అవి లీకై తాగునీరు వృథాగా పోతోంది. కొన్నిచోట్ల రబ్బర్లు చుట్టి వదిలేస్తున్నారు. వాస్తవానికి పైపులైన్లు మార్చేందుకు గుత్తేదారులు పనులు దక్కించుకొనే సందర్భంలోనే యథావిధిగా రోడ్డు బాగు చేసేలా నిబంధనలుంటాయి. వాటిని పట్టించుకోకుండా గుత్తేదారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ యంత్రాంగం స్పందించి పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని నివాసితులు కోరుతున్నారు.



తవ్వేసిన సిమెంట్ మార్గం అంచు ఇలా..



పగిలిపోయిన కొళాయి గొట్టాలకు చుట్టి వదిలేసిన రబ్బరు

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

పట్టుదలతో లక్ష్యాన్ని చేరవచ్చు

దివాన్‌చెరువు (రాజానగరం): కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చని గ్లోబల్ డిగ్రీ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ సీనియర్ కౌన్సిలర్ ఈ.రామారావు అన్నారు. దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో బుధవారం విదేశీ విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డా.ఎన్.వి.వి జగన్‌మోహన్‌రెడ్డి, డి.నరేంద్ర, ఎన్.శకుంతల తదితరులు పాల్గొన్నారు

దరఖాస్తు పరిశీలనలో జేసీ

బిక్కవోలు: జేసీ చినరాముడు బుధవారం బిక్కవోలులోని కేపీఆర్ సంస్థ తయారు చేస్తున్న గంధకం లైసెన్సు రెన్యువల్ చేయటానికి వచ్చారు. యాజమాన్యం చేసుకున్న దరఖాస్తు దృష్ట్యా పరిశీలనకు వచ్చారని తహసీల్దారు కృష్ణ తెలిపారు. పరిశ్రమ యూనిట్‌ను అంతటా జేసీ పరిశీలించారు.

బాలికల పాఠశాలలో నమూనా పోలింగ్

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక డీబీజడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాక్టిజెన్ క్లబ్ ద్వారా విద్యార్థులకు ఈ పోలింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ, ప్రచారం, ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌లో అధ్యక్షురాలుగా ఎం.కీర్తన, ఉపాధ్యక్షురాలుగా సీహెచ్.సిరివల్లి గెలిపొందారు. హెచ్‌ఎం కళ్యాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూటమిలో చేరేందుకు జగన్ తహతహ

భవానీపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ కూటమిలో చేరేందుకు వైకాపా అధినేత జగన్ తహతహలాడుతున్నారని ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లికి, చెల్లికి మంచి చేయని జగన్ ప్రజలకు ఏం మంచి చేస్తారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులు ఎంత అధ్వానంగా ఉన్నాయో ప్రజలందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని చెప్పడానికి జగన్‌కి అర్హత లేదన్నారు. భాజపా నాయకుడు కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి

కడియం: వైద్యసేవలు అందించడంలో అలసత్వం వహించవద్దని, నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది కూడా పనిచేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన కడియపులంకలోని పీహెచ్‌సీని సందర్శించారు. మెరుగైన వైద్యంను అందించాలని, సకాలంలో వ్యాధులను గుర్తించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆయన అన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎన్.రాజకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యకుమార్, ఎంపీహెచ్‌ఈవో రాజు, డాక్టర్ జెస్సీ సుప్రియ, హెచ్‌వీ ఉమాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

మహిళా సాధికారతకు పెద్దపీట

కడియం, న్యూస్‌టుడే: మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇటీవల డ్వాక్రా రుణాలు మంజూరు చేసి స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది. ఇదిలా ఉండగా కడియపులంక విరులకు పెట్టింది పేరు. ఇక్కడ కొన్నిసార్లు విలువైన విరులు వృథాగా సమీప కాలువలో దర్శనమిస్తుంటాయి. వీటిని సరైన రీతిలో సుగంధ ద్రవ్యాలు, అగరబత్తీల తయారీలో వినియోగించి లాభసాటిగా మార్చుకోవచ్చని స్వయం ఉపాధి శిక్షణా సంస్థ అందించిన శిక్షణా తరగతుల్లో వివరించారు. మండలంలోని పలు గ్రామాల మహిళలు సుమారు 52 మంది ఈ శిక్షణను పూర్తిచేశారు. వీరిలో కొందరు ఔత్సాహిక మహిళలు పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఓ బృందం ఇటీవల జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యంలో తుని మండలం తిమ్మాపురానికి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. అన్నవరం సత్యనారాయణుడికి అలంకరించిన పూలతో అగరబత్తీలు తయారీ చేసే కేంద్రాన్ని సందర్శించారు. తయారీ విధానాన్ని అమలు చేస్తున్న తీరును నిశితంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

వ్యర్థపూలతో సువాసన ద్రవ్యాలు, అగరబత్తీల తయారీ



అగరబత్తీ తయారీ విధానం తెలుసుకుంటున్న మూర్తి

మార్కెటింగ్‌కు ప్రభుత్వం కృషి..

మంజూరైన రుణాలను సక్రమంగా వినియోగించడం, బృందాలుగా ఏర్పడి లాభసాటి వ్యాపారాలను చేయడంతో ఆర్థిక ప్రగతిని సాధించవచ్చు. మహిళలు తయారు చేసే వస్తువులకు ప్రభుత్వం మార్కెటింగ్ చేసేందుకు కార్యాచరణ చేసింది. వీటిని సకాలంలో అందిపుచ్చుకుని మెరుగైన ఆర్థిక జీవన విధానానికి పునాదులుగా మలుచుకోవాలి. ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా భరోసా కల్పిస్తుంది.

– నక్కా వీవీఎస్ఎన్ మూర్తి, పీడీ, డీఆర్‌డీఏ

స్వయంశక్తినే నమ్ముకున్నా..



రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాల బలోపేతానికి రుణాలు మంజూరు చేస్తూ ఊతమిస్తుంది. ఆ నిధులను ఇంట్లో ఆర్థిక ఇబ్బందులకు కాకుండా స్వయంశక్తిగా మారి ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. దీనిలో భాగంగా యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో పలు అవకాశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రభుత్వం అందించే రాయితీలు అందిపుచ్చుకుని స్వయం ఉపాధివైపు మహిళలు అడుగులు వేసి వారి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి.

– కోటిపల్లి అనురాధ, మురమండ

ఆర్థిక ప్రగతికి భరోసా..



కుటుంబంలో ఆర్థిక సమస్యలను అధిగమించి పిల్లలకు ఉజ్వల భవితను అందించాలన్నది ప్రతి మహిళ కోరిక. వాటిని సాకారం చేసుకునేందుకు డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకుంటూ చిన్నతరహా పరిశ్రమ స్థాపనలతో ఆర్థిక అసమానతలను తొలగించాలి. అందుకు వివిధ సంస్థలు అందిస్తున్న శిక్షణావకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలి. ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం కల్పించడం శుభపరిణామం

– సూరిశెట్టి ఇందు, దుళ్ల

తుపానులతో ఆందోళన చెందొద్దు

బిక్కవోలు, న్యూస్‌టుడే: వాతావరణ పరిస్థితులు పరిశీలించి వరి కోతలు కోయాలని, ఈనెల 29వ తేదీ వరకు తుపానులు ఉన్నందున ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయ అధికారి శామ్యూల్ జాన్ తెలిపారు. బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సూచనలిచ్చారు. ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభం అవుతున్నాయని వివరించారు. ఈ నెలాఖరులోపు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తామన్నారు. విత్తన శుద్ధికోసం సోడో మోనాస్ సరఫరా చేయాలని, దాళ్వాలో వచ్చే జింకులోప నివారణకు రాయితీపై జింక సరఫరా చేయాలని రైతులు కోరారు. ఎన్‌డీఏ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

వెలుగుబంద (రాజానగరం), న్యూస్‌టుడే: ఎరువులు, పురుగుమందులు విచక్షణ రహితంగా వాడటం మంచిది కాదని, సిఫార్సు మేరకు మాత్రమే వాటిని వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని రాజానగరం, వెలుగుబంద గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక నత్రజని ఎరువుల వాడకం, పొటాష్ ఎరువును తక్కువగా వాడటం వల్ల తెగుళ్లు, పురుగు ఉధృతి పెరుగుతుందన్నారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు నరసింహారావు, శ్రీనివాస్, జయలక్ష్మి, ఏఓ ఎస్‌కే ఇమామిఖాసిం తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాధవరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కడియం, న్యూస్‌టుడే: బాల్యదశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణించడంతో మానసికోల్లాసం కలుగుతుందని హెచ్‌ఎం టి.సత్యనారాయణ కొనియాడారు. కడియం జడ్పీ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల వివిధ విభాగాల్లో జరిగిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. వీరిలో చెన్నైలో జాతీయ కరాటే పోటీల్లో 15ఏళ్ల విభాగంలో తృతీయ స్థానం సాధించిన ఇళ్ల నవీన్‌కుమార్ ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున ఇటీవల అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌కు అంకం శ్రవణి అర్హత సాధించారు, సీఎంశ్రీ పాఠశాలలు నిర్వహించిన జిల్లా స్థాయి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్స్ పోటీల్లో వంగా హారికా రాజరాజేశ్వరి ద్వితీయ స్థానం పొందారు. ఈ ముగ్గురికీ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ప్రోత్సాహాన్ని అందించారు. చిన్నారులకు బహుమతులనూ అందజేశారు. సువర్ణవేణి, డేవిడ్, వీరబాబు, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన చిన్నారులతో ఉపాధ్యాయులు

భూముల రీ-సర్వేపై మైకు ప్రచారం

సీతానగరం, న్యూస్‌టుడే: నాటి వైకాపా పాలనలో గ్రామపంచాయతీల్లో నిధులన్నీ వెనక్కి తీసుకోవడం తెలిసిందే. ఫలితంగా ప్రజలకు తెలియజేసే సమాచారానికి ఉండే దండోరా వేయించేందుకు కూడా డబ్బులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో టాంటాం మానివేశారు. భూముల రీ-సర్వేకు సంబంధించిన అక్రమాలు, తప్పులపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సుల సమాచారాన్ని తెలియజేసేందుకు సిబ్బంది లేకపోవడంతో రెవెన్యూ యంత్రాంగమే మైకు పట్టుకుని ప్రచారం చేస్తున్నారు. సీతానగరం మండలం వంగలపూడిలో వీఆర్‌ఏ మధుసూదనరావు బైక్ వేసుకుని తిరుగుతూ రైతుల కూర్చునే రచ్చబండల వద్ద భూముల సర్వేపై వచ్చిన తప్పులు సరిదిద్దుకునేందుకు చేపట్టిన గ్రామసభల వివరాలను తెలియజేస్తూ బుధవారం ఉదయం 'న్యూస్‌టుడే'కు ఇలా కనిపించారు. గతంలో దండోరా వేసిన డబ్బులే ఇంకా ఇవ్వలేదని చెప్పారు. టాంటాంకు ఎవరూ ముందుకు రావడం లేదని, దీంతో తానే మైకు పట్టుకుని రైతులకు వివరిస్తున్నానన్నారు.



ద్విచక్రవాహనంపై ప్రచారం చేస్తున్న వీఆర్‌ఏ

అమరవీరుల వారోత్సవాలు

రంగంపేట: పోలీసుల విధులు, బాధ్యతలను ఎస్సై తోట కృష్ణసాయి విద్యార్థులకు వివరించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం రంగంపేట పోలీసు స్టేషన్‌లో స్థానిక ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విధుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరులైన పోలీసులకు మౌనం పాటించి నివాళులర్పించారు.

సమాచార హక్కు సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: సమాచార హక్కు చట్టంపై అవగాహన పొందడంతో పాటు గోప్యంగా ఉన్న వివరాలను తెలుసుకునేందుకు ఈ చట్టాన్ని సద్వినియోగపరచుకోవాలని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుండేటి వెంకటరమణ సూచించారు. మన హక్కుల కోసం పోరాడు.. సాధించు ఉద్యమ సంస్థ అధ్యక్షునిగా ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రంగంపేట మండలం వడిశలేరులో బుధవారం ఆయన స్థానికులతో చర్చించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆయ్యంకి సురేష్ వెంకటరమణకు బాధ్యతలు అప్పగించారు. విజయవంతంగా బాధ్యతలను నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

కోరుకొండలో ఓపెన్ హౌస్

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్యాంసుందర్ పోలీసు విధులు, బాధ్యతలు, వాకీటాకీ పనిచేసే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీశిరిడీసాయి స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రాజా, రమ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్యాంసుందర్

శనగ విత్తనాలు పంపిణీ

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: దివాన్‌చెరువులోని రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల నైరా విద్యార్థులు రైతుల ప్రయోజనార్థం రైజోబియంతో శనగ విత్తన శుద్ధి ప్రదర్శన చేశారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా.చల్లా వెంకటనరసింహారావు, డా.మనుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: సమాజంలో విరివిగా జరుగుతున్న సైబర్‌క్రైమ్ నేరాల పట్ల విద్యార్థులు సైతం అప్రమత్తంగా ఉండాలని బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్ అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్‌లో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం సైబర్‌క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ విమల ఎస్సైను దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం జరిగిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన కల్పించారు. స్టేషన్ నిర్వహణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలను వివరించారు. పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజానగరం: పోలీసు వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ రాజానగరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై మనోహర్ స్టేషన్ సంబంధించి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆయుధాలు ఎలా ఉపయోగిస్తారు. స్టేషన్‌లో వైర్‌లెస్ సెట్స్, కమ్యూనికేషన్ డివైజెస్ ఎలా నిర్వహిస్తారు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా ఈ ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించామని సీఐ వివరించారు.



కార్యక్రమంలో విద్యార్థులతో ఎస్సై శ్రీనునాయక్

దీపావళి కానుకగా 31న 'క' విడుదల

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: లాభ నష్టాలతో సంబంధం లేకుండా 'క' చిత్రాన్ని తీశామని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో యాక్షన్, సస్పెన్స్ సహా అన్ని హంగులు ఉన్నాయని, అన్ని వర్గాల వారికి తప్పక నచ్చుతుందన్నారు. స్థానిక షెల్టన్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే విడుదల చేసిన చిత్ర టీజర్‌కి మంచి పేరొచ్చిందని, పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదల కాబోతుందన్నారు. కొత్త దర్శకులైన సందీప్, సుజిత్ సోదరులు కథ విషయంలో మూడేళ్ల కష్టపడ్డారు. చిత్ర కథానాయకుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ తాను నటించిన తొమ్మిది చిత్రాలతో పోలిస్తే 'క' వైవిధ్యంగా ఉంటుందని, దీపావళి కానుకగా ఈ నెల 31న విడుదల కానుందని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. అనపర్తికి చెందిన నిర్మాత చింతా గోపాలకృష్ణా రెడ్డి శ్రీచక్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరిట నిర్మించిన ఈ చిత్రంలో తన్వీరామ్, నయన సారిక ప్రధాన పాత్రలు పోషించారన్నారు.



మాట్లాడుతున్న నిర్మాత గోపాలకృష్ణా రెడ్డి, చిత్రంలో హీరో కిరణ్ అబ్బవరం

గుంత దారులకు మోక్షమెప్పుడో..!

ఎన్నేళ్లైనా మట్టిరోడ్డు ముందు కంకర రోడ్డు ఆ పై తారు రోడ్డుగా అభివృద్ధి చెందుతాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గోకవరంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన తారు రోడ్డు పూర్తిగా మట్టిరోడ్డుగా మారింది. గోకవరం నుంచి సంజీవయ్యనగర్ మీదుగా చిన్నూరు వెళ్లే రోడ్డు పరిస్థితి ఇది. మూడు కి.మీ. మేర విస్తరించి ఉన్న ఈ రోడ్డు మీదుగా చిన్నూరు, రామానుజపురంతో పాటు ఆర్ అండ్ ఆర్ కాలనీవాసులు, అధిక సంఖ్యలో రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రోడ్డు ఏళ్ల తరబడి కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. ఆరేళ్ల కిందట తెదేపా హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ నిధులను రద్దు చేయడంతో పాటు అయిదేళ్ల పాలనలో కనీసం మరమ్మతులైన నిర్వహించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ఈ రోడ్డు ప్రస్తుతం ఎక్కడికక్కడ గుంతలు పడి ఛిద్రమై మట్టిరోడ్డును తలపిస్తుంది.

– న్యూస్‌టుడే, గోకవరం



మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

కోరుకొండ, న్యూస్‌టుడే: కాపవరం మత్స్య సహకార సొసైటీ పాలకవర్గం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కొండేటి ధర్మరాజు, సభ్యులుగా కాటే వెంకటేశులు, కొండేటి నాగేశ్వరరావు, గుండుపల్లి వెంకట కృష్ణ, గుండుపల్లి వెంకటశ్రీనివాస్, గుండపల్లిస్వామి, పులిదిండి వెంకన్న, మట్టాడి వెంకటేశులు, సబ్బితి అక్కయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం తెదేపా సానుభూతిపరులందరూ ఏకగ్రీవంగా గెలుపొందిన నేపథ్యంలో కాపవరం సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహానికి తెదేపా సీనియరు నాయకులు తెలగంశెట్టి శ్రీను, వల్లేపల్లి దుర్గారావు, కట్టా సత్తిబాబు తదితరులు గెలిచిన అభ్యర్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమష్టిగా పోరాడదాం



వైకాపా నాయకులు కన్నబాబు, వేణు, రాజాలను సన్మానిస్తున్న నేతలు

బిక్కవోలు: వైకాపా కార్యకర్తలు, నాయకులపై దాడులు జరిగితే ఇల్లపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుందామని, ఇటీవల ఆ గ్రామ సర్పంచిపై జరిగిన దాడికి గ్రామస్థులంతా ఏకమైయ్యారని వైకాపా జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బలభద్రపురం యంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా విజయానికి అంతా సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే డా.సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమాన్ని విస్మరించి వైకాపా నాయకులను అణచివేసే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపడుతుందని ఆరోపించారు. కాకినాడ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే సీఎంగా జగన్ గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమన్నారు. పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన వేణుగోపాలకృష్ణ, కన్నబాబు, రాజాకు ఘనంగా నేతలు సన్మానించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి సదస్సులు

((సీతానగరం: రీసర్వే జరిగిన అన్ని గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని డిప్యూటీ తహసీల్దారు సర్వేశ్వరమూర్తి తెలిపారు. సీతానగరం మండలంలోని సింగవరంలో సర్పంచు సంగన చినపోసియ్య అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ రీ-సర్వే సమయంలో చోటుచేసుకున్న తప్పులపై 25 నుంచి 50 వరకు దరఖాస్తులు అందుతున్నాయన్నారు. వీటిలో కొన్నింటిని స్థానికంగానే రెవెన్యూ యంత్రాంగం పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కాగా సింగవరంలో పుంత రోడ్లు అన్ని కబ్జా చేశారని.. చేలల్లోంచి బస్తా ధాన్యం కూడా బయటకు తెచ్చుకునేందుకు చోటులేక నానా అవస్థలు పడుతున్నామని సర్పంచు సంగన చినపోసియ్య విన్నవించారు.



సింగవరం సభలో వినతులు అందిస్తున్న రైతులు

బిక్కవోలు: ఆరికిరేవులలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో వచ్చిన లోపాలు సరిదిద్దడానికి ఏర్పాటు చేసిన సదస్సుకు 35 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఇటీవల చేసిన రీ సర్వేలో తాము భూముల్ని కోల్పోయామని, లోప భూయిష్టంగా సర్వే నిర్వహించారని, తమ భూముల్ని తక్కువ చూపిస్తున్నారని, వాటిని సరిచేయాలంటూ దరఖాస్తు దారులు అధికారులను కోరారు.

అనపర్తి గ్రామీణం: మండలంలోని రామవరంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 54 దరఖాస్తులు వచ్చినట్లు అనపర్తి తహసీల్దారు అనిల్ కుమార్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం మహేంద్రవాడలో గ్రామసభ ఉంటుందని, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

పరిశ్రమను అడ్డుకునేందుకు ప్రాణత్యాగానికైనా సిద్ధం

రెండో రోజూ కొనసాగిన ఆమరణ నిరాహార దీక్ష

గోకవరం: కాలుష్య పరిశ్రమను అడ్డుకునేందుకు ప్రజల తరుపున పోరాటం చేస్తున్నామని, ప్రాణత్యాగానికైనా సిద్ధమని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్, మరో నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్ష బుధవారంతో రెండో రోజుకు చేరుకుంది. గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక, బావాజీపేట, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన పలువురు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో దుర్వాసన వాపిస్తోందని, స్వచ్ఛమైన గాలి సైతం పీల్చుకోలేని దుస్థితి నెలకొందన్నారు. వైకాపా ప్రభుత్వ తప్పిదంతోనే కాలుష్య పరిశ్రమను నివాసాలకు సమీపంలో ఏర్పాటుచేశారని, గ్రామస్థుల అభిప్రాయాలు సేకరించకుండా, పరిశ్రమపై అవగాహన కల్పించకుండా ఎలా ఏర్పాటుచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీరు రామచంద్రరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.ప్రదీప్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి ఆందోళనకారులతో మాట్లాడారు. పరిశ్రమతో ఎదురవుతున్న ఇబ్బందులు, జల, వాయు కాలుష్యాల వివరాలపై ఆరా తీశారు.



దీక్షలో శివగణేష్, సూర్యచంద్ర తదితరులు

48 గంటల్లో ధాన్యం నగదు జమ

బూరుగుపూడి (కోరుకొండ): రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపించవచ్చని, 48 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందని ఏడీఏ మల్లికార్జునరావు అన్నారు. కోరుకొండ, బూరుగుపూడి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీపీఎస్ ఉన్న వాహనాల ద్వారా ధాన్యం పంపించాలన్నారు. పీఎం కిసాన్‌లో ఎవరికైనా నగదు రాకపోతే రైతు సేవాకేంద్రంలో పాస్‌బుక్, ఆధార్‌కార్డు నకలు కాపీలు అందజేయాలన్నారు. ఏవో గౌరీదేవి, హెచ్‌వో రినీ, సర్పంచి కర్రి లక్ష్మీసరోజ తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

నందరాడ (రాజానగరం): నందరాడలో జూద శిబిరంపై మంగళవారం అర్ధరాత్రి దాడి చేసి జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని రాజానగరం సీఐ ఎస్‌పివీరయ్యగౌడ్ బుధవారం విలేకరులకు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారంతా రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన వారని తెలిపారు. ఎస్సై మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మూరు, న్యూస్‌టుడే: మహిళా ప్రాంగణంలో బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి ప్రాంగణం జిల్లా మేనేజర్ నర్సమ్మ తెలిపారు. జిల్లా మహిళా ప్రాంగణంలో రెండు కోర్సుల విద్యార్థులతో ఆమె బుధవారం మాట్లాడారు. త్వరలో శిక్షణా కాలం పూర్తవుతుందని, నెలాఖరుకు విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. కోర్సు అనంతరం వ్యాపారం చేసుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇది మొదటి కోర్సు అని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో మరిన్ని కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమంలో ప్రాంగణ సిబ్బంది శ్రీదేవి, శిక్షకురాలు అమరావతి, బ్యూటీషియన్ ట్రైనర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో నర్సమ్మ

కలుషిత నీటితో మొక్కలకు సమస్య

కడియం, న్యూస్‌టుడే: నర్సరీల్లోకి మురుగు నీరు మళ్లించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను పరిష్కరించాలని వీరవరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబాతో కలిసి రైతులు రెవెన్యూ గ్రామసభలో సమస్యను వివరించారు. శివాలయం వద్ద ఉన్న నర్సరీలోకి కలుషిత నీరు ఏళ్ల తరబడి ప్రవహిస్తూనే ఉందన్నారు. దీంతో రూ.లక్షలు విలువ చేసే మొక్కలు పాడవుతున్నాయని, తీవ్ర దుర్వాసన తప్పడం లేదన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు క్షేత్రస్థాయిలో డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి తదితర రెవెన్యూ సిబ్బంది పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



వీరవరంలో పరిస్థితులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నేడు దేవరపల్లి మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ ప్రకటనలో తెలిపారు. ముందుగా దేవరపల్లిలోని బాలదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు చెల్లించనున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేస్తారు. అలాగే రామన్నపాలెం, ధుమంతునిగూడెం, కృష్ణంపాలెం, త్యాజంపూడి, లక్ష్మీపురం, గౌరీపట్నం గ్రామాల్లో పర్యటిస్తారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.

పెరవలి - పెనుగొండ వెళ్లే రోడ్డులో రాకపోకలు నిలుపుదల

పెరవలి: పెరవలి మీదుగా పశ్చిమగోదావరిజిల్లా పెనుగొండ వెళ్లే రహదారుల భవనాల శాఖ రహదారి పెరవలి పాతపోలీస్‌స్టేషన్ వద్ద, పశ్చిమగోదావరిజిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొండ వద్ద రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్లు రహదారుల భవనాలశాఖ ఏఈ టీఆర్‌వీ ప్రసాదు తెలిపారు. రోడ్డువిస్తరణ నిర్మాణ పనుల నిమిత్తం ఈనెల 25 నుంచి వచ్చే నెల 12 వరకు నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు. తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలం ఐతంపూడి, ఏలేటిపాడు గ్రామాల్లో ప్రధాన రహదారిని నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ రహదారిలో ట్రాఫిక్‌ను పెరవలి నుంచి జాతీయరహదారిపై పశ్చిమగోదావరిజిల్లా సిద్ధాంతం మీదుగా పెనుగొండ వైపు దారి మళ్లించినట్లు వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జోరందుకున్న పొగాకు నాట్లు..


వాదాలకుంటలో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

గోపాలపురం: మెట్టప్రాంతంలో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసేది వర్జీనియా పొగాకు పంట. ప్రస్తుతం ఆ పంటకు సంబంధించి నాట్లు వేసే కార్యక్రమం గోపాలపురం నియోజకవర్గంలో జోరందుకుంది. గడిచిన మూడు రోజుల వరకు తుపాను ప్రభావంతో రైతులు నాట్లు వేయడానికి వెనుకడుగు వేశారు. ప్రతిఏటా అక్టోబరు రెండో వారంలో జోరుగా నాట్లు వేసేవారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది ఒక వారం ఆలస్యంగా వేయడం ప్రారంభించారు. నవంబరు మూడో వారం నాటికి పూర్తి స్థాయిలో నాట్లు వేయడం జరుగుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గత ఏడాది గోపాలపురం, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాల పరిధిలో 20 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ఈ ఏడాది 25వేల ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆధార్ నవీకరించుకోండి..

• మార్పులు, చేర్పులకు మరో అవకాశం

గోపాలపురం, న్యూస్‌టుడే: ఆధార్ సంఖ్య.. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ జారీ చేసిన సంఖ్య.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ఇతర వాటికి ఆధార్ తప్పనిసరి. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలంటే ఆధార్ కార్డు చాలా ముఖ్యం. అటువంటి దానిలో తప్పులు ఉంటే లబ్ధిదారులను అధికారులు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. అలాంటి ఇబ్బందులను అధిగమించడానికి ఈనెల 25వ తేదీ వరకు ఆధార్ నవీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మార్పులు, చేర్పులు వంటివి చేస్తున్నారు.


చిట్యాల ఉన్నత పాఠశాలలో ఆధార్ నవీకరణ చేస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రస్తుతం గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఎంపిక చేసిన సిబ్బంది ప్రస్తుతం పాఠశాలల్లో ఆధార్ నవీకరణ కార్యక్రమం చేపట్టారు. 20 సంవత్సరాల లోపు వారు తప్పక పుట్టిన ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. అలాగే 20 సంవత్సరాలు దాటిన వారు అయితే పదో తరగతి మార్కుల జాబితాతో నవీకరణ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. వాటిలో ఎక్కడైన తప్పులు ఉంటే సరి చేసుకుంటేనే తప్ప నవీకరణ కావడం లేదని సంబంధిత అధికారులు అంటున్నారు.

వీరికి ఉచితం..

పుట్టిన తరువాత ఒకసారి కూడా ఆధార్ కార్డు పొందని 5 నుంచి 7 ఏళ్ల లోపు చిన్నారులకు ఉచితంగా ఆధార్ నమోదు చేస్తున్నారు. ఆధార్ నమోదుకు తప్పని సరిగా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం అవసరం ఉంటుంది. గతంలో ఆధార్ కార్డు ఉండి బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి సైతం సేవలు ఉచితంగా పొందవచ్చు.

రుసుం ఇలా..

ఆధార్ కేంద్రాల్లో నవీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో పాటు రుసుం సైతం నిర్ణయించింది. 7-17 సంవత్సరాలు నిండిన వారు వేలిముద్రలు నవీకరణకు రూ.100, ముఖ చిత్రం, బయోమెట్రిక్, ఐరిస్ మార్పులకు సైతం రూ.100 వసూలు చేస్తున్నారు. చిరునామా, పుట్టిన తేదీ, ఆధార్‌కు చరవాణి లింక్, డాక్యుమెంట్లు అప్‌డేట్, లింగ మార్పిడి నమోదుకు రూ.50 చొప్పున నిర్ణయించారు.

వినియోగించుకోవాలి...

రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ నవీకరణ ప్రక్రియకు మరో అవకాశం కల్పించింది. దీన్ని అందరూ సద్వినియోగించుకోవాలి. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, ఇతర వాటిపై తప్పులు ఉంటే వెంటనే సరి చేసుకోవచ్చు.
- బి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో


యాదవోలులో నిర్మాణ పాయింట్ వద్ద రైతులతో చర్చిస్తున్న సంస్థ యాజమాన్యం

రహదారి సమస్యపై చర్చలు సఫలం

ఈనాడు కథనానికి స్పందన

దేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సంస్థ యాజమాన్యం ఆఖరికి రైతులతో చర్చలు జరిపి రహదారి సమస్య పరిష్కారానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. దేరవపల్లి మండలం యాదవోలు-జగన్నాథపురం రహదారిలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సామగ్రి పాయింట్ వల్ల భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారిపై గుంతలు పడి రైతులు రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. దీనిపై శుక్రవారం(18న) సుమారు 100 మంది రైతులు పాయింట్ వద్ద వాహనాలు నిలుపుదల చేసి ఆందోళనకు దిగారు. రైతులకు అండగా ఈనాడు నిలబడి 'కంకర రోడ్డు హామీ నెరవేర్చరేమీ..?' అనే శీర్షికతో ప్రచురించిన చిత్ర వార్తకు నిర్మాణ సంస్థ కదిలొచ్చింది. బుధవారం రహదారిపై ఆధారపడి ఉన్న రైతులతో చర్చలు జరిపింది. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు గ్రావెల్ పోసి రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యాక రోడ్డును అభివృద్ధి చేసి రైతులకు అందజేస్తామని భరోసా కల్పించారు. దీంతో రైతులు, నిర్మాణ సంస్థ యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలో పాల్గొన్న శ్రీ అభ్యాస పాఠశాల విద్యార్థులు

ప్రతిభ మెరిసి సృజన విరిసి


విజేతలతో ఉపాధ్యాయులు

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరులోని శ్రీ అభ్యాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఇందులో 10వ తరగతి విద్యార్థిని వై.సాయిసమీక్ష ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థి పి.షణ్ముఖ ద్వితీయ, ఎనిమిదో తరగతి విద్యార్థి సీహెచ్.అబ్దుల్‌సుబాన్ తృతీయ బహుమతిని పొందారు. వారికి ఈనాడు సమకూర్చిన బహుమతులను నిర్వాహకులు అందజేశారు. వ్యవస్థాపకుడు పి.రఘురామ్, ఇన్‌ఛార్జి ఆర్‌ఎస్‌ఎం విజయ, ఉపాధ్యాయురాలు కె.ఎస్.మహాలక్ష్మీ పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ద్వారా బాణసంచా అమ్మకాలు ప్రారంభం


తొలి కొనుగోలుదారుడికి బాణసంచా సామగ్రిని అందిస్తున్న డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కృష్ణమూర్తి

నిడదవోలు: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా ఏలూరు, నిడదవోలు డీసీఎంఎస్ బ్రాంచిల నుంచి బాణసంచా అమ్మకాలు ప్రారంభించినట్లు డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వీఎస్ కృష్ణమూర్తి తెలిపారు. నిడదవోలు డీసీఎంఎస్ బ్రాంచి పరిధిలో మండలంలోని సమిశ్రగూడెం డీసీఎంఎస్ విత్తనశుద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. నాణ్యమైన బాణసంచాను తక్కువ ధరకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది భీమవరంలో ఏర్పాటు చేయలేదన్నారు. నిడదవోలు, ఏలూరు కేంద్రాల ద్వారా సుమారు రూ.కోటి విలువైన బాణసంచా విక్రయాలు చేస్తారన్నారు. డీసీఎంఎస్ టర్నోవర్‌ను గణనీయంగా పెంచామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డీసీఎంఎస్ పరిధిలో 21 శాఖలు ఉన్నాయన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.104 కోట్ల టర్నోవర్ జరిగిందన్నారు. జంగారెడ్డిగూడెంలో రెండు, గోపాలపురం, దేవరపల్లి, కొయ్యలగూడెం పొగాకు కొనుగోలు కేంద్రాల పరిధిలో పొగాకు సాగు చేసే రైతులకు ముందుగా ఎరువులను అందిస్తున్నామన్నారు. ఈ విధంగా రూ.23 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందన్నారు. నిడదవోలు డిపో మేనేజర్ పెన్మెత్స శ్రీనివాసరాజు, విశ్రాంత అగ్నిమాపకాధికారి బలగం అప్పారావు పాల్గొన్నారు.

నూరుశాతం కందిపప్పు అందించాలి


మాట్లాడుతున్న ఏఎస్‌వో రామాంజనేయులు

నల్లజర్ల: ప్రతి లబ్ధిదారుడికి నూటికి నూరు శాతం కందిపప్పు నవంబరు నెల నుంచి అందించాలని కొవ్వూరు ఇన్‌ఛార్జి ఏఎస్‌వో రామాంజనేయులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నల్లజర్ల, దేవరపల్లి, నిడదవోలు మండలాల రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ డీలర్ కందిపప్పు పంచదారకు డీడీలు కట్టి ప్రజల సౌకర్యార్థం అందించాలన్నారు. నవంబరు ఒకటిన ఉదయం 6 గంటల నుంచే ప్రజాపంపిణీ చేయాలన్నారు. గోపాలపురం సీఎస్ డీటీ సత్యనారాయణరావు, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు సీమకుర్తి నరసింహమూర్తి, అక్కిన భాస్కరరావు, చెల్లు మోజేష్, బాసింశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పెరవలి: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. పెరవలి డ్వాక్రాభవనంలో మహిళలకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం బండారు రామకృష్ణ, బ్యాంకు మేనేజర్లు అచ్యుతరామారావు, డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



నిడదవోలు, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నిడదవోలులోని డొక్కా సీతమ్మ ఓరియంటల్ ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి **కాకి అహరోన్** ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నేతల భీమారావు బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో 600 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

నల్లజర్ల: మానవ అక్రమ రవాణాను నిరోధించడం మన అందరి బాధ్యతని సీడీపీవో నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం నల్లజర్లలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ వర్కర్లకు, సూపర్‌వైజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీడీపీవో పద్మావతి, ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్యశృతి, నల్లజర్ల, అనంతపల్లి, దూబచర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు

నిడదవోలు: సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న నిడదవోలు నియోజకవర్గంలోని నలుగురికి రూ.20 లక్షల ఆర్థికసాయం విడుదలకు మంత్రి కందుల దుర్గేష్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నిడదవోలు మండలంలోని విప్పర్తి శ్రీను (పెండ్యాల), సింగులూరి విజయలక్ష్మీ (తాడిమళ్ల), పెరవలి మండలంలోని గంటా నాగవెంకట సుబ్రహ్మణ్యం (ఖండవల్లి), వీరమల్లు రాంబాబు (కానూరు)లకు మంజూరు చేయించారు.

ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

ఉండ్రాజవరం: సినీనటుడు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలను సత్యవాడ, వెలగదుర్రు, వడ్లూరు తదితర గ్రామాల్లో అభిమానుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మయ్యనాయుడు మృతి పట్ల సంతాపం

ఉండ్రాజవరం: పెనుగొండ మాజీ ఎమ్మెల్యే కూనపరెడ్డి రాఘవేంద్రరావు కుమారుడు లక్ష్మయ్యనాయుడు మృతి పట్ల తాడిపర్రులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. సర్పంచి కరుటూరి నరేంద్రబాబు, ఉపసర్పంచి జవ్వాది వీరభద్రరావు, తెదేపా నాయకుడు వాకలపూడి చంద్రబాబు, జనసేన నాయకులు అరిగెల కాసు, గెల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కొవ్వూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం..ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం గ్రామానికి చెందిన గురు దుర్గారావు, అతని అత్త కొనే సత్యవతిని ఆసుపత్రిలో చూపించేందుకు బుధవారం రాజమహేంద్రవరానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొవ్వూరు శ్రీనివాసపురం పరిధి పెట్రోలు బంకువద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి రహదారి మధ్యస్త విభాజకాన్ని ఢీకొట్టారు. ఈక్రమంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108వాహనానికి సమాచారం ఇచ్చారు. వారిని కొవ్వూరు ఆసుపత్రిలో ప్రథమచికిత్స చేసి అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి..

నల్లజర్ల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన జగన్నాథపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది. అనంతపల్లికి చెందిన వెల్డర్ కొవ్వూరి దుర్గాప్రసాద్ జగన్నాథపురంలో ఇంటి స్లాబ్‌పై ఇనుప ఊసలు కడుతుండగా ప్రమాదవశాత్తు ఆ ఊసలు సమీపంలో ఉన్న విద్యుత్తు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

నల్లజర్ల, న్యూస్‌టుడే: మండలంలోని తెలికిచెర్ల శివారులో కోడి పందేల స్థావరంపై నల్లజర్ల పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి 16 మందిని అదుపులోకి తీసుకున్నారని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి 5 పుంజులు, 3 కత్తులు, రూ.9,400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సమాజ రక్షణే పోలీసుల కర్తవ్యం


ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం: సమాజ భద్రత, రక్షణే పోలీసుల కర్తవ్యం అని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని అభ్యాస పాఠశాలలో 'ఓపెన్‌హౌస్' పేరిట ఆయుధాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల తుపాకీలను విద్యార్థులకు చూపించి వాటిని ఏఏ సందర్భాల్లో వినియోగిస్తారో వివరించారు. ప్రిన్సిపల్ పాలడుగుల రఘు, పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామికి పూజలు



నిడదవోలు, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం మునిపల్లిలో వేంచేసి ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయ సన్నిధిలో బుధవారం సందర్భంగా భక్తులు 11 ప్రదక్షణలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణ నిర్వహించారు.

అవీ ఇవీ అన్నీ

ర్యాంపుల వద్ద ఇసుక సరఫరా వాయిదా

నిడదవోలు, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు నిడదవోలు నియోజకవర్గంలోని పందలపర్రు, పెండ్యాల, జీడిగుంట, విజ్జేశ్వరం ఇసుక ర్యాంపుల్లో ట్రాక్టర్లపై ఇసుక సరఫరా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎస్సై వీరబాబు బుధవారం తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చేవరకు ట్రాక్టర్లను ర్యాంపుల వద్దకు తీసుకురావద్దని యజమానులకు తెలిపారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం, నిడదవోలు: రాజీమార్గంలో ఇరుపక్షాలకు న్యాయం జరిగేందుకు లోక్ అదాలత్‌లు తోడ్పడతాయని కొవ్వూరు తొమ్మిదో అదనపు ఇన్‌ఛార్జి జడ్జి డి.సత్యవతి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు డిసెంబరు 14న కొవ్వూరు, నిడదవోలు న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, వాహనప్రమాద, చెక్‌పోస్టు, ప్రీలిటికేషన్ కేసులకు పరిష్కారం దొరకనుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడిలోని నవదుర్గాదేవి ఆలయంలో మహాకుంభాభిషేకం, శతచండీయాగం మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని బుధవారం పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అన్నదానం నిర్వహించారు.

సత్యసాయి నిత్యాన్నదానం

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రార్థించే పెదవుల కన్న సాయం చేసే చేతులు మిన్న అనే సంకల్పంతో సత్యసాయి సేవా సమితులు నడుస్తున్నాయని ఆ సమితి ప్రతినిధులు తెలిపారు. కొవ్వూరు సామాజిక ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలో ఉన్న శ్రీసత్యసాయి నిత్యాన్నపూర్ణ పథకం ఆరో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ పథకం కన్వీనర్లు గురుగుపల్లి వెంకటేశ్వరరావు, రమాసత్యనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారికి సహాయకులుగా వచ్చేవారికి మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు.

సొంతస్థలాల్లోనే గోకులం షెడ్లు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: రైతులు సొంత స్థలాల్లోనే గోకులం షెడ్లు నిర్మించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ క్లస్టర్ టీఏ రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం షెడ్లు ఎంపికైన రైతులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఇతర వ్యక్తుల స్థలాల్లో వీటిని నిర్మించకూడదన్నారు.

నగదుకు వందశాతం భద్రత కల్పిస్తాం


మాట్లాడుతున్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

నల్లజర్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ, వ్యాపార, చేతి వృత్తులు చేసుకునే వారికి రుణాలు సమకూర్చడానికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఏర్పాటయ్యిందని ఆ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెలికిచెర్లలో ఆ బ్యాంకు నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 41 ఏళ్ల క్రితం ప్రారంభమైందని, దేశంలో 270 బ్రాంచులు ఉన్నాయని, 30 లక్షల మంది ఖాతాదారులతో లావాదేవీలు జరపుతున్నామన్నారు. వ్యవసాయదారుల పిల్లలు విదేశాలకు వెళ్లి చదువుకోవడానికి పొలం దస్తావేజులపై రుణాలు అందజేస్తామన్నారు. ఏలూరు ఆర్.ఎం.శ్రీదేవి, తెలికిచెర్ల బ్రాంచ్ మేనేజర్ స్వామి, సుంకర సుబ్బారావు, సుంకర ప్రతాప్, చీమకుర్తి రాము, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జుల పాలనతో సతమతం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మండల పరిషత్తు కార్యాలయాల్లో రెగ్యులర్ ఎంపీడీవోలు లేక ఇన్‌ఛార్జుల పాలన కొనసాగుతుంది. ఇటీవల అధికారుల బదిలీల ప్రక్రియ ముగిసింది. నిడదవోలు నియోజకవర్గంలో ఉండ్రాజవరం, నిడదవోలు, పెరవలి మండలాలకు ఎంపీడీవోలు ఎవరు బదిలీపై రాలేదు. దీంతో నియోజకవర్గంలోని మూడు మండల పరిషత్తు కార్యాలయాల్లోనూ ఎంపీడీవోలు లేక ఇన్‌ఛార్జిలతో పాలన కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవోలు వేరే నియోజకవర్గాలోని మండలాలకు బదిలీపై వెళ్లారు. ఇక్కడికి ఎవరూ రారా అని అధికారులు ప్రశ్నించుకుంటున్నారు. మిగిలిన శాఖలకు అధికారులు బదిలీపై వచ్చినా ఈ నియోజకవర్గానికి ఎంపీడీవోలు మాత్రం రాకపోవటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ బాధ్యతలను ఈవోపీఆర్‌డీలు, ఏవోలకు అప్పగించారు. ఇన్‌ఛార్జుల పాలన వల్ల అదనపు బాధ్యతలు వహించటంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పనుల్లో సైతం జాప్యం చోటు చేసుకుంటుందని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. బదిలీల్లో రాకున్నా డిప్యూటేషన్‌పై వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నష్టాల ఊబిలో బెల్లం బట్టీలు

- న్యూస్‌టుడే, నల్లజర్ల


తయారైన బెల్లం కుందులు

చక్కెర వాడకం ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ.. బెల్లం వినియోగం ఏమంతగా తగ్గలేదు. ఇప్పటికీ బెల్లంతో చేసిన పిండి వంటలను ఇష్టపడే వారు అధికమే. టీ దుకాణాల్లోనూ బెల్లం టీ ప్రత్యేకం. వినియోగ ప్రాధాన్యం ఉన్నప్పటికీ బెల్లం ధర పెరుగుదల లేకుండా నిలకడగా ఉండిపోవడంతో తయారీకి బట్టీల నిర్వాహకులకు నష్టాలు తప్పడం లేదు. బెల్లం ధర పెరగకపోయినా.. చెరకు ముడి సరకు ధర, కూలీల వేతనాలు పెరగడంతో బట్టీలు నిర్వహణ కష్టతరంగా మారింది. చెరకు తోట వద్దే కుటీర పరిశ్రమల్లా పూర్వం నుంచి కనిపించే బట్టీలు చాలా వరకు మూతపడ్డాయి. ఒక్క నల్లజర్ల మండలంలోనే గతంలో సుమారు 30 బెల్లం బట్టీలుండేవి. అవి క్రమంగా మూడుకు తగ్గిపోయాయి. బట్టీల్లో తయారైన బెల్లం కుందులను ఒక్కోటి రూ.80కి విక్రయిస్తున్నారు. ఈ బట్టీలో ఒక్కో విడత 80 నుంచి 90 కిలోల బెల్లం తయారవుతుంది. ఇలా రోజులో 6 నుంచి 8 సార్లు బెల్లం ఉత్పత్తి చేస్తుంటారు. ఒక్కో బట్టీకి 10 నుంచి 15 మంది వరకు కూలీలు అవసరం. ఒక్కో కూలీకి రోజుకు వేతనం రూ.వెయ్యితో పాటు చెరకు టన్ను ధర రైతు వద్ద రూ.1300 నుంచి రూ.2000 పెరిగింది. రవాణా కోసం అదనంగా మరో ఖర్చు. అన్ని కలుపుకొంటే టన్ను బెల్లం తయారీకి రూ.5000 వరకు అవుతోందని బట్టీల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టన్ను బెల్లానికి రూ.500 నుంచి రూ.800 వరకు నష్టం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయిదేళ్లుగా ఇబ్బందులే..



32 ఏళ్లుగా బెల్లం బట్టీ నిర్వహిస్తూ 20 మందికి ఉపాధి చూపుతున్నా. గత 12 ఏళ్లుగా బెల్లం ధర కిలో రూ.40 నుంచి రూ.50 మాత్రమే నిలకడగా ఉండిపోవడం.. మరోపక్క తయారీకి చెరకు సహా అన్ని ఖర్చులు ఏటా పెరుగుతుండడం వల్ల నష్టాలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.
- బొప్పన సత్యనారాయణ, బట్టీ నిర్వాహకుడు, అచ్చన్నపాలెం